

తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 274 శుక్రవారం, నవంబర్ 06, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 8 రూ. 2.00

అమెరికాతో డీల్‌పై భారత్ ఆచితూచి అడుగులు..

- కలిసిరానున్న ఎన్నికల ఫలితాలు!
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్‌కు తగ్గిన తొందర
- రిపబ్లికన్లకు పట్టు తగ్గడంతో సుంకాల విషయంలో కలిసి రావొచ్చని అంచనా
- ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమన్న ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్
- ఇకపై అదనపు సుంకాలు విధించాలంటే సెక్షన్ 301, 232 కింద విచారణలు తప్పనిసరి
- దీంతో భారత్‌కు అకస్మాత్తుగా సుంకాల షాక్ తగిలే ప్రమాదం తగ్గుతుందని అంచనా



(న్యూఢిల్లీ, సాక్షర): అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలన్న భారత్ తొందర తగ్గిందని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తాజా నివేదిక వెల్లడించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు కాంగ్రెస్‌పై పూర్తి ఆధిపత్యం కోల్పోవడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కొంత తగ్గిందని విశ్లేషించింది. దీంతో భారత్‌పై సుంకాల విషయంలో ఆకస్మిక ఒత్తిళ్లు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమని తెలిపింది. అమెరికా గతంలో ప్రకటించిన 18 శాతం సుంకాల విధానం అమల్లోకి రాలేదు. ప్రస్తుతం భారత వస్తువులపై 10 శాతం సెక్షన్ 301 సుంకం మాత్రమే అమలవుతోందని నివేదిక వివరించింది. అంతేకాకుండా, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) ద్వారా ట్రంప్‌కు ఉన్న ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం కూడా తగ్గిందని పేర్కొంది. ఇకపై అదనపు సుంకాలు విధించాలంటే సెక్షన్ 301, 232 కింద విచారణలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో భారత్‌కు అకస్మాత్తుగా సుంకాల షాక్ తగిలే ప్రమాదం తగ్గుతుందని అంచనా వేసింది. అయితే వాణిజ్య రంగంలో అనిశ్చితి పూర్తిగా తొలగిపోలేదని నివేదిక హెచ్చరించింది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలపై సెక్షన్ 232 కింద అదనపు సుంకాలు విధించే ప్రమాదం ఉందని పేర్కొంది. రష్యా, ఇరాన్‌తో దౌత్య సంబంధాల్లో ప్రతికూల పరిణామాలు ఎదురైతే.. భారత్ చమురు దిగుమతులపై మళ్లీ ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 2028 ఎన్నికలకు ముందు వినియోగదారులకు ధరల ఉపశమనం కల్పించాల్సిన రాజకీయ అవసరం ట్రంప్‌పై ఉంటుందని విశ్లేషించింది. మరోవైపు అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం భారత్‌కు ఊరటనిస్తోంది. అక్టోబర్ 2026లో నమోదైన గరిష్ఠ స్థాయిలతో పోలిస్తే బ్రెంట్ క్రూడ్ ధర 19 శాతం తగ్గి బ్యారెల్‌కు 95 డాలర్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భారత్ చమురు దిగుమతుల బిల్లు 24 శాతం పెరిగింది. ఈ నేపథ్యంలో ధరల తగ్గుదల విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించనుంది. చమురు ధరలు తగ్గడం, డాలర్ బలహీనపడటం రూపాయి స్థిరత్వానికి దోహదపడతాయని నివేదిక పేర్కొంది. అయితే ఆర్బీఐ వద్ద 239 బిలియన్ డాలర్ల ఫార్వర్డ్ డాలర్ బాధ్యతలు ఉండటంతో రూపాయి మరింత బలపడటానికి పరిమితులు ఉండొచ్చని అంచనా వేసింది. మరోవైపు అమెరికాలో ద్రవ్యోల్బణం అధికంగానే కొనసాగితే వడ్డీ రేట్లు త్వరగా తగ్గకపోవచ్చని తెలిపింది. దీంతో ఆర్బీఐ అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని నివేదిక వివరించింది.

‘ఆర్‌ఆర్ ట్యాక్స్’ నిజమే అయితే చర్యలేవి?

పేజీ 3

22 ఏ రిజిస్ట్రేషన్లకు లైన్ క్లియర్

పేజీ 2

తెలంగాణలో భారీగా మిగిలిపోయిన ఎంబీబీఎస్

పేజీ 3

హైదరాబాద్ మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ ధరలను తగ్గించనున్న

పేజీ 4

ఆదర్శ గ్రామ పంచాయతీగా "ఇల్లూరు" ఎంపిక..

- పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీగా ఇల్లూరు సెలెక్ట్
- కులమత రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి..
- ఇల్లూరు ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కృషి చేసిన కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్

(మధిర, సాక్షర): మండలంలో నెంబర్ వన్ గ్రామంగా ఇల్లూరు ను ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచి గ్రామ ప్రజలు.
కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామాల్లోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పారిశుధ్య కార్యక్రమాలు ఇతర వాటిలి పరిగణలోకి తీసుకొని గ్రామపంచాయతీలను పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీలను ఎంపిక చేయటం జరిగింది దానిలో భాగంగా మధిర మండలం నుండి ఇల్లూరు గ్రామం ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం జరిగింది. 2 లో

మురసు తుపాను ఎఫెక్ట్..

- వాయిదా పడ్డ కేఆర్ఎంబీ భేటీ
- సమావేశాన్ని వాయిదా వేయాలని కోరిన ఏపీ ప్రభుత్వం
- ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన కీలక సమావేశం
- జల వివాదాలపై చర్చలకు మరోసారి బ్రేక్
- తదుపరి తేదీపై త్వరలో స్పష్టత ఇస్తామన్న బోర్డు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలపై చర్చించేందుకు నేడు జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం మరోసారి వాయిదా పడింది. మురసు తుపాను సహాయక చర్యల్లో అధికారులు నిమగ్నమై ఉన్నందున ఈ భేటీని వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని బోర్డు ఆమోదించింది.
తుపాను ప్రభావం వల్ల అధికారులు ప్రత్యక్షంగా లేదా వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యే పరిస్థితి లేదని ఏపీ ప్రభుత్వం బోర్డుకు వివరించింది. 3 లో

కాంగ్రెస్ లో నిధుల మంటలు

(మహబూబ్ నగర్, సాక్షర): :తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా పార్టీ అంతర్గత విభేదాలు మాత్రం నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉన్నాయి. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి నేరుగా తమ సొంత ప్రభుత్వంపైనే అసంతృప్తి వ్యాఖ్యలు చేయడం, విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం టీపీసీసీలో పెను దుమారం రేపుతోంది. ఇద్దరు ఎమ్మెల్యేల వేదన, ఆరోపణలు దాదాపు ఒకే తీరుగా ఉన్నాయి నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు రావడం లేదు, మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యత దక్కలేదు, నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేల తరహాలోనే పోరాడాల్సి వస్తోంది అని వారు బహిరంగంగానే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అసంతృప్తి వెనుక కేవలం నిధులు, మంత్రి పదవుల ఆశలు మాత్రమే కాక టెండర్ల కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కకపోవడం కూడా ఉందనే ఆరోపణలు నడుస్తున్నాయి. 3 లో

ఇరాన్ యుద్ధమే రిపబ్లికన్లను ముంచింది: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

(వాషింగ్టన్, సాక్షర): అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీ ఓటమికి ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధమే ప్రధాన కారణమని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అభిప్రాయపడ్డారు. గతంలో డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతుగా నిలిచిన అనేకమంది ఓటర్లు ఈసారి డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన తన విశ్లేషణను సుదీర్ఘంగా పంచుకున్నారు. ఓటింగ్ శాతం తగ్గడం వల్ల తాము ఓడిపోలేదని, తమ మద్దతుదారులు ప్రత్యర్థి పార్టీకి ఓటు వేయడమే అసలు సమస్య అని వాన్స్ స్పష్టం చేశారు.

పూర్తిగా 3 లో

నాతో చర్చకు వస్తే మోదీ దేశ ద్రోహి అని ఐదు నిమిషాల్లో నిరూపిస్తా

(రాహుల్‌గాంధీ, సాక్షర): : కేంద్రం ప్రభుత్వం పై, ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని, ఆయనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని ఆరోపించారు. తనతో చర్చకువస్తే మోదీ దేశ ద్రోహి అనే ఆ విషయాన్ని ఐదు నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు.ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని విమర్శించారు.

పూర్తిగా 2 లో

భూముల అమ్మకమే ఆదాయ మార్గమా...

(హైదరాబాద్, సాక్షర): మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి భారీ విజయాన్ని అందించింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత విలువైన ప్రభుత్వ భూములపై హక్కులను రాష్ట్రం తిరిగి సాధించుకుంది. అయితే ఈ భూములను విక్రయించి ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు తెరలేపింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన భూముల విక్రయ విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

పూర్తిగా 2 లో

ట్రంప్ ఓటమి..



(న్యూయార్క్, సాక్షర): అమెరికా మిడ్ టర్మ్స్ ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ల జోరుకు అడ్డుకట్ట పడింది. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రతినిధుల సభ), సెనేట్‌లో డెమోక్రాట్లు మెజార్టీ సాధించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా పడిపోయాయి బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు ఏకంగా 118 డాలర్ల స్థాయిలో ఉండగా అది ఇప్పుడు 94 డాలర్ల మార్కు దిగొచ్చింది. ఈ క్రమంలో ఏకంగా 20 శాతానికిపైగా పడిపోవడం గమనార్హం. బుధవారం రాత్రి వేళనే ఏకంగా 10 శాతం పతనం అయ్యాయి. ఇప్పుడు గురువారం సెషన్ ఆరంభంలో కూడా ఇంకా పతనం అవుతూనే ఉంది. ఇది ఒక దశలో 93.46 డాలర్ల స్థాయి కనిష్ఠానికి పడిపోయింది.మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు గెలవడంతో ఇరాన్‌పై ట్రంప్ సైనిక చర్యలకు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉండటంతో, ఇరాన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు పడనుందనే అంచనాలు మార్కెట్లో పెరిగాయి. దీంతో అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం ఖరారు కావొచ్చని భావిస్తున్నారు. ఇదే ఉద్రిక్తతల్ని తగ్గించడంతో, చమురు సరఫరా వ్యవస్థలో కూడా అంతరాయాలు తొలగిపోతాయన్న అంచనాలు పెరిగాయి. పూర్తిగా 2 లో

పార్లమెంటుకు రండి చర్చిద్దాం..



ప్రధాని నరేంద్ర మోదీతో చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్ విసరడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. వీధుల్లో కాకుండా పార్లమెంటులో చర్చకు రావాలని సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. హర్యానాలోని కర్నాల్‌లో గురువారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో చర్చ కావాలంటే ఆయనకు లేఖ రాయాలని రాహుల్‌కు సూచించారు. ఎస్ఐఆర్‌పై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని, పార్లమెంటుకు వచ్చి తన వాదనలు వినిపించాలని సవాల్ విసిరారు. దేశ వ్యతిరేకులు ఎవరు? విదేశీ శక్తులతో సంబంధాలు ఎవరికి ఉన్నాయి? ఆ సంబంధాల స్వరూపం ఏంటి? అనే అంశాలపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాహుల్ గాంధీ నవంబర్ 3న మరోసారి సవాల్ విసిరారు. ఎక్కడైనా, ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని ఎక్స్‌లో పోస్టు చేశారు. పూర్తిగా 3 లో

లద్దాక్ ప్రాంతాల్లో కరెంట్ ...

(శ్రీనగర్, సాక్షర): మనిషికి బలంగా అనుకుంటే ప్రకృతి కూడా సహకరిస్తుంది. ప్రతికూల పరిస్థితి కూడా చిన్నబోతుంది. ఎముకలు కొరికే చలి.. కనుచూపుమేర మంచుకొండలు.. అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టం.. ఇలాంటి చోట కొంతమందికి పనే దైవం. విధి నిర్వహణే వారికి శిరోధార్యం ఇలాంటి ఇబ్బందుల్లో కూడా వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రజల ఇబ్బందులతో పోల్చితే.. ఇవి ఒక ఇబ్బందులా అని వారు అనుకున్నారు.. అంతేకాదు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాణాల సైతం లెక్క చేయలేదు. దీనికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది.జమ్ము కాశ్మీర్లోని లద్దాక్ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యాలను మరింత పెంపొందించేందుకు కార్మికులు కృషి చేస్తున్నారు. వారు చేస్తున్న పని ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు కూడా విద్యుత్ సదుపాయం కల్పించాలని లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం అడుగులు వేస్తోంది ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగా సిబ్బంది అత్యంత కఠినమైన వాతావరణంలో పని చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు మైనస్ 10 డిగ్రీలకు పడిపోయినప్పటికీ పనులు ఏమాత్రం ఆపడం లేదు.వందల అడుగుల ఎత్తులో విద్యుత్ స్తంభాలు.. లైన్లకు సంబంధించిన పనులు చేస్తున్నారు. చుట్టూ మంచుకొండలు.. కింద లోతైన లోయలు.. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా సరే ప్రమాదం జరిగే పరిస్థితులు.. అయినప్పటికీ కార్మికులు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనులు చేస్తున్నారు.లద్దాక్ ప్రాంతంలోని నుబ్రా ర్యాలీ.. సియాచిన్ గ్లేషియర్ వంటి ప్రాంతాలలో పనులు జరుగుతున్నాయి. సాధారణ సమయంలో విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడమే చాలా శ్రమతో కూడుకుంటుంది. అలాంటిది మంచు ప్రాంతాలలో.. అత్యంత ఎత్తైన ప్రదేశాలలో విద్యుత్ సదుపాయం కల్పించడం అంటే మామూలు ఇబ్బంది కాదు. అక్కడి వాతావరణం ఇప్పుడు ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. తీవ్రమైన చలి.. బలమైన గాలులు.. మంచు వల్ల పనులకు నిత్యం ఆటంకాలు కలుగుతూ ఉంటాయి. అయినప్పటికీ నిర్ణయించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు.ఈ పనులకు సంబంధించిన వీడియోలు బయటికి వచ్చాయి. దీంతో చాలామంది కార్మికుల శ్రమను కొనియాడుతున్నారు. ప్రశంసలు కురిపిస్తున్నారు. మన ఇంట్లో వెచ్చగా ఉంటూ.. విద్యుత్ కాంతుల మధ్య జీవితాన్ని కొనసాగిస్తున్నామంటే.. దాని వెనుక ఇటువంటి కార్మికుల శ్రమ ఉంటుందని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. మైనస్ పది డిగ్రీల చలిలో.. వందల అడుగుల ఎత్తులో వారు చేస్తున్న ఈ సాహసానికి నిజంగా హాట్సాఫ్ చెప్పాల్సిందే.

గచ్చిబౌలి సర్వే నెం. 136 భూవివాదం..

• ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపణలు నిరాధారం..

(బాధితుల ప్రెస్ మీట్, సాక్షర): శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 136లోని భూమికి సంబంధించి బిఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వాస్తవాలను పక్కదోవ పట్టించేలా ఉన్నాయని ఆ భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ బలరాం నాయక్ వారి కుమారుడు 4 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారంటూ ప్రవీణ్ కుమార్ చేసిన ప్రకటనలను వారు తీవ్రంగా ఖండించారు.ప్రెస్ మీట్లో బాధితుడు జైహింద్ మరియు ఇతర సభ్యులు మాట్లాడుతూ... 1982లో అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం సన్నకారు రైతుల కింద 38 మంది దళిత లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 242 నుండి 246 గజాల చొప్పున పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. ఆ పట్టాలను బ్యాంకుల్లో మోర్టగేజ్ పెట్టి, ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో కోళ్ల ఫారాలు నిర్మించుకుని దశాబ్దాలుగా ఉపాధి పొందుతున్నామని స్పష్టం చేశారు.గతంలో కోళ్లకు రోగాలు వచ్చి చనిపోవడంతో షెడ్లు ఖాళీగా ఉన్న సమయంలో, అప్పటి కలెక్టర్ మురళి కృష్ణ విజ్ఞప్తి మేరకు ఆ స్థలాన్ని రెండేళ్ల పాటు అంబేద్కర్ ట్రస్ట్‌కు లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. అయితే లీజు గడువు ముగిసినప్పటికీ షెడ్లను తిరిగి తమకు అప్పగించకుండా అధికారులు లీజును పొడిగిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మొత్తం 38 మంది లబ్ధిదారులలో 6 గురు ఎస్సీ లంబాడ వర్గానికి, 32 మంది మాదిగ సామాజిక వర్గానికి చెందినవారని వివరించారు. దళితులకు సేవ చేస్తానని చెప్పే ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రైవేటు వ్యక్తుల స్వప్రయోజనాల కోసం తమను రోడ్డు పాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కష్టపడి గుడిసెలు వేసుకొని జీవిస్తున్న దళితులకు ఆధారం లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు.బాధితుల ప్రధాన డిమాండ్లుసర్వే నంబర్ 136లోని కోళ్ల ఫారాల వద్ద ప్రస్తుతం 38 మంది లబ్ధిదారులమే పొజిషన్‌లో ఉన్నామని, ఆ స్థలం తమదేనని స్పష్టం చేశారు. మార్చి 26, 2026 నాటి కోర్టు ఉత్తర్వుల ప్రకారం దళితులకు చెందాల్సిన భూమికి సంబంధించి వెంటనే చట్టబద్ధమైన పట్టాలు మంజూరు చేయాలి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తమకు రావలసిన న్యాయమైన హక్కులను పునరుద్ధరించాలి. కోళ్ల ఫారాలను కూల్చివేసి స్థలాన్ని వేరే అవసరాలకు మళ్లించే ప్రయత్నాలను, తప్పుడు ప్రచారాలను తక్షణమే నిలిపివేయాలి.తమ భూమిని కాపాడుకోవడానికే ముందుకు వచ్చామని, ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా తమకు రావాల్సిన పట్టాలు తమకిచ్చి ప్రభుత్వం న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి..



• రేవంత్ ప్రభుత్వానికి కవిత డిమాండ్

(హైదరాబాద్, సాక్షర): ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అందుకోసం రేవంత్ ప్రభుత్వానికి నెల రోజులు సమయం ఇస్తున్నామన్నారు. అయ్యప్ప సొసైటీలో ఇల్లు కొని ఎవరూ నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ సొసైటీలో 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని వివరించారు.గురువారం హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. అయ్యప్ప సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సొసైటీలోనే నారాయణ, చైతన్య విద్యా సంస్థలు ఉన్నాయని గుర్తు చేశారు. సర్వే నెంబర్ 11/18 నుంచి 11/44 వరకు అక్రమ నిర్మాణాలు జరిగాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమి కనిపించటం లేదని వ్యంగ్యంగా అన్నారు. ఈ దందా ఆపించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు. గురుకుల ట్రస్ట్ భూములపై అనేక ఉద్యమాలు చేశామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ వచ్చి.. రాజకీయాలు తప్ప ఏం మాట్లాడలేదని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా చేస్తే.. అమిత్ షా హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారని వివరించారు. బీఆర్ఎస్ పార్టీపై మాట్లాడటం పని కొచ్చే అంశం కాదని టీఆర్ఎస్ చీఫ్ కవిత అభిప్రాయపడ్డారు.

"కాంగ్రెస్ ఎంపీల సంఖ్య పెరగాలంటే ఇలా చేయాలి"..



• రాహుల్‌కు కేంద్రమంత్రి 7 సలహాలు
• విదేశీ పర్యటనలు తగ్గించి భారత్‌లో ఎక్కువ సమయం గడపాలని హితవు
• సీనియర్లను గౌరవించాలని, భారత్ వ్యతిరేక వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచన
• పార్లమెంటు చర్చల్లో కాంగ్రెస్ ఎంపీలు పాల్గొనాలని సూచన
• రాజ్యాంగ సంస్థలను గౌరవించి కుటుంబ రాజకీయాలకు ముగింపు పలకాలన్న మంత్రి
• మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్ విసరడంతో ముదిరిన మాటల యుద్ధం

(న్యూఢిల్లీ, సాక్షర): లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సవాల్ విసురుతుంటే.. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్‌కు పార్లమెంటులో మరిన్ని స్థానాలు కావాలంటే రాహుల్‌గాంధీ ఏడు విషయాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. తరచూ రహస్యంగా విదేశీ పర్యటనలకు వెళ్లడం మానుకోవాలని, సీనియర్లను గౌరవించాలని హితవు పలికారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాహుల్‌గాంధీ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్లకుండా భారత్‌లో ఎక్కువ సమయం గడపాలని రిజిజు సూచించారు. సీనియర్ నేతలను గౌరవిస్తూ వారి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తులను కలవకూడదని, వారి ఎజెండాను ప్రోత్సహించకూడదని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీపై వ్యతిరేకత తగ్గించుకోవాలని సూచించారు. బీజేపీని రాజకీయ ప్రత్యర్థిగా చూడాలే తప్ప శత్రువుగా భావించకూడదన్నారు. పార్లమెంటు కార్యకలాపాలను మరింత సీరియస్‌గా తీసుకోవాలని, కాంగ్రెస్ ఎంపీలకు చర్చల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధ సంస్థలను గౌరవించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలని, కుటుంబ రాజకీయాలకు ముగింపు పలకాలని ఏడో సూచనగా పేర్కొన్నారు. అంతకుముందు పార్లమెంటులో విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన పాత వీడియోను రిజిజు ఎక్స్‌లో పంచుకున్నారు. చర్చలు, వాదోపవాదాల కోసమే పార్లమెంటు ఉందని పేర్కొన్నారు. చర్చల్లో పాల్గొనడానికి ఇష్టపడనివారే ఇప్పుడు బహిరంగ చర్చ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాహుల్‌గాంధీ బుధవారం మరోసారి సవాల్ విసిరారు. ఐదు నిమిషాల్లోనే ప్రధాని దేశద్రోహి అని నిరూపిస్తానంటూ వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా స్పందించారు. అంతకుముందు కూడా ప్రతిపక్షాన్ని దేశ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరిస్తున్నారంటూ మోదీపై రాహుల్ విమర్శలు చేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

మొదటి పేజీ తరువాయి

భూముల అమ్మకమే ఆదాయ మార్గమా...

తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, వాటి వినియోగం ఇప్పుడు రాజకీయంగా కీలక అంశంగా మారింది. మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు రావడం ప్రభుత్వానికి పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు న్యాయపోరాటం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. అయితే ఈ విజయం తర్వాత ఆ భూములను అమ్మి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చుకోవాలన్న రేవంత్ రెడ్డి ఆలోచన మాత్రం ఆర్థిక విధానంపై చర్చకు దారితీస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వ భూకేటాయింపులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో హిల్స్ వంటి భూముల కేటాయింపుల విషయంలో కేసీఆర్, హరీశ్ రావు గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. పదేళ్ల అధికారంలో వాటిని ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఒక వైఖరి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో వైఖరి ఎందుకు అనుసరించారని నిలదీస్తున్నారు.అంతేకాకుండా కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలో శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ ఏర్పాటు చేస్తామని రేవంత్ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందించాలన్నది ఈ ప్రతిపాదన లక్ష్యంగా పేర్కొన్నారు. ఎర్రవల్లి, షేర్ వెంకటాపూర్ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల వ్యవహారంపైనా ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇప్పటివరకు 345 ఎకరాలను మాత్రమే గుర్తించారని, మరో 43 ఎకరాల ఆచూకీ తేలాల్సి ఉందని వెల్లడించారు. ఈ రెండు గ్రామాల్లో సమగ్ర భూ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూమిలేని అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అయితే ప్రభుత్వ భూములను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవడం తెలంగాణలో కొత్త విధానం కాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. 2021 జూలైలో కోకాపేటలో దాదాపు 50 ఎకరాల భూములను వేలం వేయడం ద్వారా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూర్చుకుంది. 2023 ఆగస్టులో కోకాపేట, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన భూముల వేలం ద్వారా సుమారు రూ.7,100 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది.నియోపోలిస్ భూముల వేలం ద్వారా రూ.3,319.60 కోట్లు, బుద్వేల్ భూముల ద్వారా రూ.3,625.73 కోట్ల ఆదాయం లభించింది. అంతేకాకుండా ఔటర్ రింగ్ రోడ్డును టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రైవేట్ సంస్థకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం ముందస్తుగా రూ.7,380 కోట్ల ఆదాయాన్ని పొందింది. అంటే ప్రభుత్వ ఆస్తులను నగదుగా మార్చుకోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలోనూ కీలక భాగంగా ఉంది.అయితే భూముల అమ్మకాల ద్వారా భారీ ఆదాయం వస్తుందని అంచనా వేసినా, ఆ అంచనాలను వాస్తవ ఆదాయంతో సరిపోల్చడంలో గత ప్రభుత్వం విఫలమైందని కాగ్ నివేదికలు తప్పుబట్టాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నివేదికలో భూములు, ఆస్తుల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై ప్రభుత్వం అధిక అంచనాలు వేసిందని కాగ్ ప్రస్తావించింది. గత అంచనాలు నెరవేరకపోయినా మళ్లీ భారీ ఆదాయ అంచనాలు చూపించడం ఆర్థిక నిర్వహణలో సమస్యలకు దారితీస్తుందని సూచించింది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ప్రభుత్వ భూములు ఒక పరిమితమైన సంపద. ఒకసారి వాటిని విక్రయిస్తే తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం అంత సులభం కాదు. పాఠశాలల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు అత్యంత అవసరమైనవే. కానీ అలాంటి పథకాల కోసం ప్రభుత్వ భూములను విక్రయించడమే ప్రధాన ఆదాయ మార్గంగా మారితే భవిష్యత్తులో పరిస్థితి ఏమిటన్నది ఆలోచించాల్సిన అంశం.ముఖ్యంగా ఒకసారి వచ్చే భూముల అమ్మకాల ఆదాయాన్ని ప్రతి ఏడాది ఖర్చు చేయాల్సిన సంక్షేమ పథకాలకు ఉపయోగించడం ఆర్థికంగా ఎంతవరకు సమంజసం? ప్రభుత్వ పాఠశాలలు, సాగునీటి ప్రాజెక్టుల వంటి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆ నిధులను వినియోగించడం ఒక కోణమైతే, నిరంతరం ఖర్చు చేయాల్సిన పథకాలకు ఒకేసారి వచ్చే ఆదాయాన్ని ఆధారంగా చేసుకోవడం మరో కోణం. సంక్షేమ పథకాలకు ప్రతి సంవత్సరం స్థిరమైన ఆదాయ వనరులు అవసరం. భూముల అమ్మకాల ద్వారా వచ్చే డబ్బు ఎప్పటికీ అందుబాటులో ఉండదు.గత ప్రభుత్వ భూవ్యవహారాలను ప్రశ్నిస్తున్న రేవంత్ రెడ్డికి ఇప్పుడు తన విధానాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. మియాపూర్ భూములను విక్రయించాలని నిర్ణయిస్తే.. వాటి ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? ఆ నిధులను ఏయే పథకాలకు కేటాయిస్తారు? వాటి వినియోగంపై ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది? భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు కరిగిపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందుంచాలి.ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణల నుంచి కాపాడటం ఎంత ముఖ్యమో, వాటిని భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంచడం కూడా అంతే ముఖ్యం. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు దక్కిన విజయం. ఆ విజయాన్ని మరో భూముల విక్రయానికి అవకాశంగా చూడటం మాత్రం సరైన విధానం కాకపోవచ్చు.కేసీఆర్ ప్రభుత్వం భూముల విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకునే విధానానికి బలమైన, దీర్ఘకాలిక ఆర్థిక ప్రత్యామ్నాయాన్ని చూపించలేకపోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు అదే విధానాన్ని విమర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడిస్తే తేడా ఏముంటుంది? రాజకీయ విమర్శలకు అతీతంగా ప్రజా ఆస్తుల నిర్వహణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాల్సిన బాధ్యత రేవంత్ ప్రభుత్వంపై ఉంది.ప్రభుత్వాలు భూములను అమ్మి తాత్కాలికంగా డబ్బు సమకూర్చుకోవడం కంటే, కొత్త సంపదను సృష్టించడం, ఆదాయ వనరులను పెంచడం, ప్రభుత్వ ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలి. రాజకీయ హామీల అమలు కోసం తరతరాల సంపదను విక్రయించడం తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత ఆర్థిక విధానం కాదు. తెలంగాణ భవిష్యత్తు కోసం భూముల అమ్మకాల కంటే స్థిరమైన ఆదాయ మార్గాలే కీలకం.

మొదటి పేజీ తరువాయి ఇరాన్ యుద్ధమే రిపబ్లికన్లను ముంచింది: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

ఇరాన్ యుద్ధాన్ని ముగించాలని, పెరుగుతున్న జీవన వ్యయం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలని ఓటర్లు బలంగా కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం, ఇజ్రాయెల్‌తో సంబంధాలపై పునఃసమీక్ష వంటి అంశాలు కూడా ఓటర్ల తీర్పును ప్రభావితం చేశాయని వివరించారు. యుద్ధం కారణంగానే తాము పరాజయం పాలయ్యామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం అంగీకరించారని వాన్స్ పేర్కొన్నారు. అయితే, ఈ వాదనతో ట్రంప్ పాక్షికంగానే ఏకీభవించడం గమనార్హం. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించడానికి సైనిక చర్య తప్పనిసరి అయిందని, మళ్లీ అలాంటి పరిస్థితి ఎదురైనా ఇదే నిర్ణయం తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. తాజా ఎన్నికల ఫలితాల ప్రకారం, ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమోక్రటిక్ పార్టీ ఆధిక్యం సాధించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీలో ఓటమికి గల కారణాలపై ప్రస్తుతం అంతర్గత చర్చ తీవ్రస్థాయిలో మొదలైంది.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధనకు వ్యక్తిత్వ వికాస శిక్షణ దోహదం



- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

(ఆదిలాబాద్, సాక్షర): విద్యార్థులు చిన్నతనం నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణతో చదువుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. పట్టుదల, సానుకూల దృక్పథం అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు.గురువారం మావల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు, చేస్తున్న త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మనసులోని భయాలను వీడి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని తెలిపారు.జీవితంలో లక్ష్య నిర్దేశం, మానవతా విలువలు, వేదికపై మాట్లాడే భయాన్ని అధిగమించడం, సానుకూల ఆలోచనా విధానం, జ్ఞాపకశక్తిని పెంపొందించే మెమరీ టెక్నిక్స్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇలాంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు.అనంతరం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల ఆరోగ్య వివరాలతో రూపొందించిన హెల్త్ ప్రొఫైల్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సాధన, కేజీబీవీ ప్రత్యేకాధికారి సువర్ణ, సెక్టోరల్ అధికారి సరిత, ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ డైరెక్టర్లు రంజిత్, రాము, సుధాకర్, వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలో ఆటంకాలు లేకుండా సేవలు అందించాలి : డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్



(మంచిర్యాల, సాక్షర): జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్‌హెచ్‌ఎం ఎం వైద్య సిబ్బంది ధర్నాలో ఉన్నందున వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మంచి ర్యాల జిల్లా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆదేశించారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు సిబ్బందితో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించడం, నమోదు చేయడం, నిశ్చయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్టులను అందజేయాలన్నారు. మాతా శిశు సంరక్షణ, గర్భవతుల నమోదు, ఆసుపత్రిలో ప్రసవాలు, అమ్మఒడి అంబులెన్స్ సర్వీస్ లను ఉపయోగించుకొనుట, కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ సర్పంచులు, సిబ్బంది పరిశుభ్రతపై, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలోజిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ, సీహెచ్వో జయమేరీ, పర్యవేక్షకులు రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్ నెలాఖరుకే ధర్పల్లి ఏరియా ఆసుపత్రి పూర్తి చేయాలి



- నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- నాణ్యతలో రాజీ వద్దని ఆదేశం

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నెలకొల్పుతున్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి తుది దశ నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా చేపట్టి డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.ధర్పల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 30 పడకల స్థాయి నుంచి 100 పడకలకు పెంచుతూ ఏరియా ఆసుపత్రిగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిన నేపథ్యంలో రూ. 33.15 కోట్ల నిధులను వెచ్చిస్తూ అధునాతన వసతులతో నూతన భవన నిర్మాణం జరుపుతున్నారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే 90 శాతం వరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, ఇంకా చేపట్టాల్సి ఉన్న తుది దశ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మిగతా పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.మాతాశిశు, పీడియాట్రిక్ విభాగాలు, క్యాజువాలిటీ, రేడియాలజీ, ఆపరేషన్ థియేటర్లు, ఆయుష్ బ్లాక్, మేల్, ఫిమేల్ వార్డు, ఆప్తాలమిక్, డెంటల్, ఓ.టీ, డయాగ్నొస్టిక్ తదితర విభాగాలను కలెక్టర్ సందర్శించి పనుల నాణ్యతను నిశితంగా పరిశీలన జరిపారు. నాణ్యత విషయంలో ఎక్కడ కూడా రాజీ పడవద్దని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.పనులు చేపట్టే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తేవాలని సూచించారు. తుది దశ పనులను క్రమం తప్పకుండా సందర్శిస్తూ పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల నిర్మాణాలు, నిర్దేశించిన విధంగా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయా లేదా అన్నది నిర్ధారణ చేసుకున్న తరువాతే హ్యాండ్ ఓవర్ చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డా. కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా. శ్రీనివాస్ ప్రసాద్, స్థానిక తహసిల్దార్ శాంత, టీజీఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు ఉన్నారు.

తెలంగాణపై ఎల్‌నీనో ఎఫెక్ట్.. బోర్‌వెల్స్‌కు ఎన్‌వోసీ తప్పనిసరి



(హైదరాబాద్, సాక్షర): ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జల మట్టాలు పడిపోకుండా చూడటం, లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో జల వనరులను సంరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాగునీటి అవసరాలు తప్ప ఇతర పనులకు శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తూ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. 2027 జులై చివరి వరకు అమల్లో ఉండేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో 259 ద్వారా ఈ ఉత్తర్వులను జారీ చేశారు. జీవో 259లోని ముఖ్యమైన నిబంధనలు అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టులు, వాణిజ్య-పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లు, బల్క్ వాటర్ సప్లైయిర్లు భూగర్భ జలాల వినియోగ నిబంధనలు-2023 ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందిన తర్వాతే కొత్త బోర్లు తవ్వాల్సి ఉంటుంది.

అనుమతులతో బోర్‌వెల్ తవ్వకం పూర్తి చేసిన 15 రోజుల్లోగా రిగ్ ఆపరేటర్ నిర్ణీత అధికారికి 'వెల్ కంప్లీషన్ రిపోర్ట్'ను సబ్మిట్ చేయాలి. ఆ బోర్‌వెల్‌ను సంబంధిత తహసీల్దార్ వద్ద తప్పనిసరిగా నమోదు చేయించాలి.నిర్మాణ ప్రాజెక్టులు, తోటల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు భూగర్భ జలాలను వాడకూడదు. జలమండలి అందుబాటులోకి తెచ్చిన శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలి.భూగర్భ జలాలను అక్రమంగా వెలికితీసినా లేదా దుర్వినియోగం చేసినా 'వాల్టా' చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.ప్రతిఒక్కరూ వాననీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.భూగర్భజల శాఖ: నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన సంరక్షణ చర్యలు చేపట్టాలి.మున్సిపల్ కార్పొరేషన్లు: భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణాలను తప్పనిసరిగా అమలు చేయించాలి.హైడ్రా : చెరువులు, కుంటలు, నీటి రీఛార్జ్ ప్రాంతాలను ఆక్రమణలు, వ్యర్థాల డంపింగ్, కాలుష్యం నుంచి కాపాడాలి.మంచి నీటి సరఫరా పైప్‌లైన్ నెట్‌వర్క్‌లో లీకేజీలు, వృథాను అరికట్టడంతో పాటు కంటింజెన్సీ మానిటరింగ్ కమిటీకి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందించాలి.

జిల్లా వ్యాప్తంగా గంజాయి స్పెషల్ డ్రైవ్..



- 57 మందికి పాజిటివ్
- తెల్లవారుజామునే 90 మంది ఇళ్లలో తనిఖీలు
- మాదకద్రవ్యాల రహిత జిల్లానే లక్ష్యం : ఎస్పీ అఖిల్ మహాజన్

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): మాదకద్రవ్యాల రహిత జిల్లానే లక్ష్యమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక గంజాయి తనిఖీ డ్రైవ్ నిర్వహించారు.ఆదిలాబాద్, ఉట్నూర్ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో గంజాయి సేవిస్తున్నట్లు అనుమానం ఉన్న వ్యక్తులు, గతంలో మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తుల ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 90 మందిని తనిఖీ చేయగా, ప్రత్యేక డ్రగ్ టెస్టింగ్ కిట్లు, యూరిన్ టెస్టుల ద్వారా 57 మంది గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది.జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించే లక్ష్యంతో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 8712659973 నంబర్ కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

3గంటల్లోనే తప్పిపోయిన బాలిక ఆచూకీ



(ఇచ్చోడ, సాక్షర): ఇచ్చోడ మండలంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక పలు కారణాలతో గురువారం ఉదయం 7 గంటల సమయంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయింది. పాఠశాల సిబ్బంది బాలిక కోసం పాఠశాల పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఉదయం 9:30 గంటలకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.వెంటనే స్పందించిన ఇచ్చోడ ఎస్సైచ్ఓ వి. ప్రవీణ్ కుమార్ రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసులు వేగంగా తనిఖీలు నిర్వహిస్తూ ఇచ్చోడ - నిర్మల్ బైపాస్ వద్ద ఉన్న ఓ గ్యారేజ్ సమీపంలో తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బాలికను మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో గుర్తించి సురక్షితంగా రక్షించారు. విచారణలో బాలికకు చదువు మీద ఆసక్తి తక్కువగా ఉన్నట్లు తెలిపారు.అనంతరం బాలికను పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను కేవలం మూడు గంటల్లోనే సురక్షితంగా గుర్తించి అప్పగించిన పోలీసులకు ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సందర్భంగా బాలికను సురక్షితంగా రక్షించడంలో చురుకుగా వ్యవహరించిన ఇచ్చోడ ఎస్సైచ్ఓ వి. ప్రవీణ్ కుమార్, ఎస్సై చిన్న గంగన్న, పోలీస్ సిబ్బంది సంజీవ్, గణేష్ తదితరులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు గమనించినప్పుడు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

తుఫాన్ ధాటికి కొట్టుకుపోయిన లో లెవల్ చప్టా

- వంతెన నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- రూ.1.60 కోట్లు మంజూరు చేసినా ప్రారంభానికి నోచుకోని పనులు

(ములకలపల్లి, సాక్షర): ములకలపల్లి మండల పరిధిలోని పూసుగూడెం-వీకే రామవరం మధ్య ఉన్న లో లెవల్ చప్టా మురసు తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గురువారం బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సర్పంచ్ గుగులోత్ ధర్మా, తాటి రవి చప్టాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూసుగూడెం నుండి వీకే రామవరం, సంజీవపల్లి, కొత్తూరు తదితర గ్రామాల మీదుగా బూర్గంపాడు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ చప్టా ఉందని తెలిపారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షాలకే చప్టాపై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 2024లో ప్రభుత్వం హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా శంకుస్థాపన కూడా నిర్వహించారని గుర్తుచేశారు.దీంతో తమ కష్టాలు తీరుతాయని భావించిన గ్రామస్తులకు నిరాశే మిగిలిందన్నారు. శంకుస్థాపన జరిగి ఇంతకాలం గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదని విమర్శించారు. బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతి పెరిగి చప్టా పూర్తిగా కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హై లెవల్ వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

బేతుపల్లి చెరువు ఘటన

- అధికారులకు సీఎం రేవంత్ అభినందనలు

(హైదరాబాద్, సాక్షర): ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో గల్లంతైన మత్స్యకారులు, వారిని రక్షించేందుకు వెళ్లి చిక్కుకుపోయిన పలువురు ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు చేపట్టిన సహాయక చర్యల్లో పాలుపంచుకున్న ఎన్డీఆర్ఎఫ్ (NDRF), ఎస్డీఆర్ఎఫ్ (SDRF), అగ్నిమాపక సిబ్బందికి, అధికారులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న బేతుపల్లి చెరువులో చిక్కుకున్న మత్స్యకారులు, వారిని కాపాడటానికి వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది అందరూ సురక్షితంగా బయటపడేందుకు NDRF, ఇతర సహాయక బృందాలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో చేసిన కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సిబ్బంది ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయమని అన్నారు. సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు.

పవర్ స్ప్రేయర్ల కొనుగోలుపై రైతులకు రాయితీ

- ఎంఐడీహెచ్ పథకం కింద 50 శాతం వరకు సబ్సిడీ..
- జిల్లాకు 100 యూనిట్ల లక్ష్యం

(గుడిహత్నూర్, సాక్షర) : జిల్లాలోని రైతులకు పవర్ స్ప్రేయర్ల కొనుగోలుపై ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ తెలిపారు. ఎంఐడీహెచ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం (గరిష్ఠంగా రూ.10 వేలు), ఇతర రైతులకు 40 శాతం (గరిష్ఠంగా రూ.8 వేలు) సబ్సిడీ అందిస్తామన్నారు. జిల్లాకు 100 యూనిట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హులైన రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంకు వివరాలతో సంబంధిత ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7382183962, 9951777993 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతి డివిజన్ కు రూ.20 లక్షలు..



- అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్
- కార్పొరేషన్ కౌన్సిల్ లో తీర్మానం - నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): కార్పొరేషన్ కౌన్సిల్ లో ప్రతి డివిజన్ కు 20 లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయించినందున అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం జరుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు.గురువారం నగరంలోని 22, 25, 35వ డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్ లో ప్రతి డివిజన్ కు 20 లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు.అర్బన్ నియోజకవర్గంలో డివిజన్ కు కోటి రూపాయల పనులు కూడా కొన్ని డివిజన్లలో ప్రారంభమయ్యాయని, కొనసాగుతున్న పనుల్లో నాణ్యత ఎంతో ముఖ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు.అమృత్ 2 పథకం కింద నగరంలో యూజీడీ పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అయితే పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి సూచించడం జరిగిందన్నారు.ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, కావున పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రధానంగా అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పడం జరిగిందన్నారు.అలాగే ఇందూరులోనే ఘన చరిత్ర గల అతి పురాతనమైన ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కూడా రాబోతుందన్నారు. ఇటీవల ఇందుకు సంబంధించిన అధికారులు, కంపెనీ ప్రతినిధులు సందర్శించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, 22వ డివిజన్ కార్పొరేటర్ వైష్ణవి సుధా, 25వ డివిజన్ కార్పొరేటర్ చింతకాయల రాజేందర్, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం సుధీర్, బీజేపీ నాయకులు పవన్ ముందడ, శ్రీనివాస్, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

(కమాన్ పూర్, సాక్షర): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది అని బి ఆర్ ఎస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. గురువారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీడీవో మరియు తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు.కమాన్ పూర్ మండల పరిధిలో వరి పంటలు కోతల సమయం వచ్చినప్పటికి దాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గురువారం బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ప్రభుత్వ మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని త్వరితగతిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల విక్రయ ఇబ్బందులు తొలిగించాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికీ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మండలంలో వరి కోతలు జరుగుతున్నప్పటికి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు.కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మధ్య దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకుందన్నారు.ప్రక్కన పెద్దపల్లి నియోజకవర్గంలో గత వారం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కమాన్ పూర్ మండలంలో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఇప్పటికైనా మండలం పరిధిలో సెర్ప్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేయట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, చిందం తిరుపతి, రాచకొండ రవి, నీలం శ్రీనివాస్, జాబు సతీష్, , రాచకొండ చంద్రమౌళి, పెండ్లి నారాయణ, పొట్ల సతీష్, కొయ్యడ సంపత్, పంతకాని రవి, నడిగొట్టు సంపత్, పొట్ల శంకర్, కొండిల్ల ఓదెలు, గుర్రం శంకర్, ఒడ్నాల సతీష్, షేక్ మొహినుద్దీన్, దండే రమేష్ ఠాగూర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ మున్సిపాలిటీ విభాగాలను పరిశీలించిన 18 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు.

- పట్టణ పరిపాలన, అభివృద్ధి పనులపై మున్సిపల్ చైర్‌పర్సన్‌తో సమీక్షా

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): ఆదిలాబాద్ పట్టణంలో శిక్షణలో భాగంగా పర్యటిస్తున్న 18 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ విభాగాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిపాలనా విధానాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ డంపింగ్ యార్డ్, మున్సిపల్ వాటర్ సెక్షన్, పంప్‌హౌస్‌లు, మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ సెక్షన్, టౌన్ ప్లానింగ్ విభాగం, మ్యూటేషన్ సెక్షన్, ఎస్టాబ్లిష్‌మెంట్, ఇంజనీరింగ్ విభాగాలను సందర్శించి ఆయా విభాగాల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలు, నిర్వహిస్తున్న పరిపాలనా ప్రక్రియల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, పట్టణ ప్రణాళిక, భవన నిర్మాణ అనుమతులు, మున్సిపల్ అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న పౌర సేవలు తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణ పరిపాలనలోని వివిధ విభాగాల పనితీరు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ట్రైనీ ఐఏఎస్ అధికారులకు వివరించారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు.అదేవిధంగా పట్టణ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ట్రైనీ ఐఏఎస్ అధికారుల నుంచి పలు సూచనలు, సలహాలను కూడా స్వీకరించారు.శిక్షణలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా పరిపాలనా విధానాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవల అమలు తీరు వంటి అంశాలపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు,

ఔషధాల నిల్వ, సరఫరాపై కలెక్టర్ సమీక్ష



- టీవీవీపీ భవనాన్ని పరిశీలించిన భవేశ్ మిశ్రా

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన ఔషధాల నిల్వ, సరఫరా నిర్వహణను మరింత పకడ్బందీగా చేపట్టేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులకు అవసరమైన మందులను సురక్షితంగా నిల్వ చేసేందుకు తగిన వసతులు కల్పించాలని సూచించారు.ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో ఉన్న వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో నిల్వ ఉంచిన ఔషధాలను అవసరాలకు అనుగుణంగా టీవీవీపీ భవనానికి తరలించాలని అధికారులకు సూచించారు.ఔషధాల అవసరం, ప్రాధాన్యతను బట్టి వాటిని క్రమపద్ధతిలో నిల్వ చేయాలని, మందుల సరఫరా, నిల్వల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఔషధాలు పాడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని స్పష్టం చేశారు. అలాగే నిల్వ కేంద్రానికి అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రులకు మందుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ పరిశీలనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీసీహెచ్ఎస్ కాశీనాథ్, అధికారులు సౌమ్య, వంశీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిరేవులో శ్రీ పద్మాల్పూరి కాకోను దర్శించుకున్న ఎంపీ గోడం నగేష్



(దండేపల్లి, సాక్షర):

మండలంలోని గుడిరేవు గ్రామంలో వెలిసిన ఆదివాసుల ఆరాధ్య దైవం శ్రీ పద్మాల్పూరి కాకో అమ్మవారిని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ దర్శించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆ తర్వాత ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన దర్బార్ లో ఎంపీ గోడం నగేష్ పాల్గొని మాట్లాడారు.ఈ పుణ్యక్షేత్రం అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో మాట్లాడి రూ. 40 లక్షల నిధులు మంజూరు చేయించి, శ్రీ పద్మాల్పూరి కాకో ఆలయ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు.ఆలయ అభివృద్ధి కోసం కేవలం నిధులు మాత్రమే కాకుండా, ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన మౌలిక వసతులను కూడా మంజూరు చేయించామని వివరించారు.భవిష్యత్తులో కూడా ఈ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి, ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ వారి పుణ్యక్షేత్రాల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తానని ఎంపీ నగేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆదివాసి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కావలి ఆంజనేయులు

- నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా పులకరం సైదులు నియామకం



(హైదరాబాద్/ ఆదిలాబాద్, సాక్షర): మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీతో పాటు వివిధ జిల్లాల్లో ముదిరాజులను బీసీ డి నుంచి బీసీ ఏ లోకి మార్చడంతో పాటు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో ముదిరాజులు ఎదుర్కొంటున్న రోజువారీ ఇతర సమస్యలపై ఉద్యమాలు చేపట్టేందుకు వీలుగా సంఘాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది.ఇందులో భాగంగా మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇదివరకు జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న కావలి ఆంజనేయులు ముదిరాజును నియమించారు. అదే విధంగా ఆయన స్థానంలో ఆంజనేయులు ముదిరాజ్ ప్రతిపాదించిన మునుగోడు మండలానికి చెందిన పులకరం సైదులు ముదిరాజును నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజులు నియామక పత్రాలను అందజేశారు.ఈ మేరకు గురువారం హిమాయత్ నగర్ లోని మహాసభ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో వారికి నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజులు మాట్లాడుతూ బీసీ జనాభాలో అత్యధిక సంఖ్యా బలం కలిగిన ముదిరాజులకు సత్వర న్యాయంతో పాటు సామాజిక న్యాయం అందించడమే లక్ష్యంగా మన ముదిరాజ్ మహాసభ పనిచేస్తుందని అన్నారు.ముదిరాజులను బీసీ ఏ లో చేర్చడం కోసం ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రిని కలవడంలో మన ముదిరాజ్ మహాసభ ముఖ్యపాత్ర పోషించిందని స్పష్టం చేశారు. గత అనేక దశాబ్దాలుగా ముదిరాజులు ఎదుర్కొంటున్న బీసీ ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మన ముదిరాజ్ మహాసభ మిగతా సంఘాల సమన్వయంతో కలిసి చేస్తున్న పోరాటంలో ముందుందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని సంఘాల సమన్వయంతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల గంగాధర్ ముదిరాజ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులు మాజీ ఎంపీటీసీ ఆత్కూరి రాములు ముదిరాజ్, పులకరం బాలకృష్ణ ముదిరాజ్, పులకరం కిరణ్ ముదిరాజ్, జుట్టు అనిల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందర్భంగా పేకాటపై ప్రత్యేక నిఘా



- పేకాట ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

(ఆదిలాబాద్, సాక్షర): దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో ఎక్కడైనా పేకాట నిర్వహించినా, ఆడినా, ఆడించినా లేదా పేకాట స్థావరాలను ఏర్పాటు చేసి ఇతరులను ప్రోత్సహించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.పేకాట చట్టవిరుద్ధమైన కార్యకలాపమని, పేకాట నిర్వహణకు ఎలాంటి అవకాశం లేకుండా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి పటిష్టమైన నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు పేకాటపై ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కడైనా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నా, ఆడిస్తున్నా లేదా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు తెలిసినా వెంటనే జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న మెసేజ్ యువర్ ఎస్పీ వాట్సాప్ నంబర్ 8712659973 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ప్రజలందరూ పోలీసులకు సహకరించి పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ దీపావళి పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

5వ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్



- 2026 ముగింపు ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్
- వివిధ జిల్లాల నుంచి హాజరుకానున్న పోలీస్ క్రీడాకారులు , అధికారులు
- అతిథులకు వసతి సౌకర్యాలు ఏర్పాట్లు

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 25 నుండి 28 వరకు నిర్వహించనున్న 5వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2026 ముగింపు క్రీడా పోటీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐ.పి.యస్ సూచించారు.గురువారం ఈ క్రీడా పోటీల కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి క్షుణ్ణంగా పరిశీలించారు.నిజామాబాద్ జిల్లాలో ఈనెల 25 నుండి 28 వరకు నిర్వహించే 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026 సంబంధించిన వాటర్ స్పోర్ట్స్ అథ్లెటిక్స్ సైక్లింగ్ క్రాస్ కంట్రీ స్విమ్మింగ్ ఆర్చరీ మొదలగు విభాగాలను నుండి క్రీడాకారులు నిజామాబాద్ కు వస్తున్న సందర్భంగా వారికి అన్ని రకాల ఏర్పాట్లను చేయడం జరుగుతుందని సీపీ తెలిపారు. ఈ సందర్భంగా జానకంపేటలోని పోలీస్ శిక్షణ కేంద్రం, మోపాల్‌లో ఏర్పాటు చేస్తున్న ఆర్చరీ పోటీ స్థలంతో పాటు అలీ సాగర్ బోటింగ్ , నిజామాబాద్‌లోని ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్, పాల్దా, జన్నపల్లి ప్రాంతాల్లోని రన్నింగ్ పోటీల నిర్వహణ స్థలాలను సందర్శించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు.అదేవిధంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరుకానున్న పోలీస్ క్రీడాకారులు , అధికారులు , అతిథులకు వసతి సౌకర్యాలు , భోజన ఏర్పాట్లు , తాగునీరు , పారిశుద్ధ్యం , వైద్య సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించారు.

క్రీడా పోటీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్రీడాకారులకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.ఈ సందర్భంగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సిసిఎస్ ట్రాఫిక్ ఏసీపీలు ప్రకాష్ , వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం, మస్తాన్ అలీ , సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు , ఎస్సైలు, డివైఎస్ఓ పవన్ కుమార్, ఆర్చరీ కోచ్ ఎన్. రవీందర్, అథ్లెటిక్ సెక్రటరీ కోచ్ రాజా గౌడ్, స్విమ్మింగ్ ఇంచార్జి ఫారుక్ తదితరులు పాల్గొనడం జరిగింది

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

(బేల,సాక్షర): ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని, ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.బేల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 59 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్, స్థానిక సర్పంచ్‌ల చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు చొరవ తీసుకొని వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో మహేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వామన్, బేల సర్పంచ్ భాగ్యలక్ష్మి, అశోక్ పటేల్, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు తిరిగి దక్కిన 100 మొబైల్ ఫోన్లు

- 18 నెలల్లో 1800 ఫోన్ల రికవరీ : ఎస్పీ అఖిల్ మహాజన్



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): మొబైల్ ఫోన్ లేనిదే ఎలాంటి పని జరగని ప్రస్తుత సమాజంలో మనకు అత్యంత విలువైనది, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సాంకేతిక పరికరం మొబైల్ ఫోన్. మొబైల్ ఫోన్ లో అన్ని వివరాలు, అన్ని జ్ఞాపకాలు, అన్ని లావాదేవీలకు సంబంధించిన అప్లికేషన్లు ఉంటాయి. సాధారణంగా ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగలించబడటం జరుగుతుంది.పోగొట్టుకున్న వాటిని పొందాలంటే, బాధితులు వెంటనే https://www.ceir.gov.in వెబ్ సైట్ లో లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు.ఆదిలాబాద్ జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టడం కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం వివిధ రాష్ట్రాల నుంచి, జిల్లాల నుంచి బాధితులు పోగొట్టుకున్న, దొంగలించబడిన నెల రోజుల వ్యవధిలో 100 మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టింది. గత 18 నెలల్లో ఈ బృందం దాదాపు 1800 మొబైల్ ఫోన్లను తిరిగి బాధితులకు అందజేశారు. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీకులు, బీదవారు. వారు ఎంతగానో కష్టపడి కొనుక్కున్న మొబైల్ ఫోన్ ను తిరిగి వారికి అందజేయాలని సదుద్దేశంతో జిల్లా ఎస్పీ ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు.ముఖ్యంగా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరిగే ప్రాంతాలు రైతు బజార్, రిమ్స్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇళ్లలో దొంగతనాలు, బంధువులకు ఫోన్ చేస్తానంటూ ఫోన్ తస్కరించడం లాంటివి జరుగుతున్నాయని, వాటి వల్ల అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.మొబైల్ ఫోన్లను తిరిగి ఇచ్చే క్రమంలో గురువారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, చోరీకి గురైన బాధితులకు 100 మొబైల్ ఫోన్లు (దాదాపు 18 లక్షల విలువ చేసే) వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి బాధితులకు తిరిగి అందజేశారు.ఈ సందర్భంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్న బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రతి నెల రోజుల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేస్తామని హామీ ఇచ్చారు.ఒకవేళ ఎప్పుడైనా ప్రజలు, బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఎడల వెంటనే దగ్గరలో ఉన్న సంబంధిత పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని తెలిపారు. మొబైల్ దొంగతనాలు జరిగే క్రమంలో వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.మొబైల్ ఫోన్ దుకాణాల యజమానులు, రిపేరింగ్ దుకాణాల యజమానులు, మొబైల్ ఫోన్ కొనే ముందు మొబైల్ ఫోన్ యజమాని అనుమతి, సరైన పత్రాలు తీసుకోవాలి. దొంగ మొబైల్ ఫోన్లు కొన్న ఎడల వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐలు మహేష్, పి గోపి కృష్ణ, రియాజ్, మజీద్, అన్వేష్, నవనీత్, జుబేర్, ఇజాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలి

- ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలాల వారీగా చేయూత పింఛను దరఖాస్తుల పరిశీలన వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశించారు.రానున్న రోజుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా జరగాలని, ఎక్కడా నీటి సమస్య రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని బోరుబావుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు.జిల్లాలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మంజూరైన ఇళ్లు, పూర్తయినవి, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను ఈ సందర్భంగా సమీక్షించారు.అనంతరం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పీఎం శ్రీ పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, వారి సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లాలని, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, సందీప్, అనిల్, డిఈఓ భోజన్న, హౌసింగ్ పిడి శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు

- 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు సెక్షన్ 108 బీఎన్ఎస్ కింద 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 1000 జరిమానా, జరిమానా కట్టని ఎడల అదనంగా 3 నెలల జైలు శిక్ష, భార్య పట్ల క్రూరత్వం కేసులో మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 1000 జరిమానా, జరిమానా కట్టని ఎడల మూడు నెలలజైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి జీవీఎన్ భారత లక్ష్మీ గురువారం తీర్పు చెప్పారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం ధర్మారం (బి) గ్రామ నివాసులైన బాలస్వామి, సబ్బని ఉమా మహేశ్వరి ప్రేమించుకుని ఏప్రిల్ 2012లో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె కలిగారు.డబ్బులు అవసరమైనప్పుడు భార్యను శారీరక, మానసిక బాధలకు గురి చేసి తల్లిదండ్రుల నుంచి డబ్బులు తీసుకురమ్మని పంపించేవాడు. కూతురు బాధలు చూడలేక అవసరమైనప్పుడు ఉమా తల్లి నిర్మల ఆదుకునేది. ధర్మారం గ్రామంలో నిర్మలకు ఓపెన్ ప్లాట్ ఉన్నది. అది అమ్మివేసి అందులో వచ్చే సగం డబ్బులు ఇచ్చే విధంగా తల్లిదండ్రులను బలవంతం చేయమని కొన్నేళ్లుగా భార్యను వేధింపులు చేయసాగాడు.భర్త వేధింపులు భరించలేని ఉమా మహేశ్వరి 2024 సెప్టెంబర్ 20వ తేదీన ఇంటిలో చీరను ఫ్యాన్ కు గట్టిగా చుట్టి మెడకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.నేర అభియోగాలు కోర్టు న్యాయ విచారణలో రుజువైనట్లు సెషన్స్ జడ్జి భారత లక్ష్మీ తమ తీర్పులో నిర్ధారించారు. భార్య పట్ల క్రూరత్వంగా ప్రవర్తించినందుకు మూడు సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు మరో ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా వేశారు. జరిమానాలు చెల్లించని ఎడల అదనంగా మూడు నెలల చొప్పున జైలు శిక్ష అనుభవించాలని సెషన్స్ జడ్జి తమ తీర్పులో పేర్కొన్నారు.నేరస్తునికి శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడడంలో ప్రముఖ పాత్ర పోషించిన ఇన్వెస్టిగేషన్ అధికారి మహమ్మద్ షరీఫ్ ఎస్ఐపి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రాజేశ్వర్ రెడ్డి, బ్రీఫింగ్ ఆఫీసర్ ఆరిఫ్ ఎస్ఐపి డిచ్ పల్లి పీఎస్, టి. గోవింద్ ఎస్ఐపి కోర్టు లైజన్ ఆఫీసర్, కోర్టు సీఎంఎస్, సిడిఓలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రశంసిస్తూ అభినందించారు.

నేలమట్టం అయిన సిసిఐ టవర్లు- ఆవిరయిన యువత ఆశలు

ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యువతకు "ఆదిలాబాదు సిమెంటు పరిశ్రమ" పునరుద్ధరిస్తారనుకున్న అవకాశాలు, ఆశలపై నీల్లు చల్లారు. కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి ప్రభుత్వాలు పరిశ్రమను తిరిగి తెరిచే అవకాశాలు కనిపించడం లేదు. పరిశ్రమకు ఆధునిక సాంకేతికను ఉపయోగించి మూలధనం 250 కోట్లు ప్రభుత్వాలు కేటాయిస్తే మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణంగా అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. అదిలాబాద్ జిల్లా కేంద్రానికి ఆనుకొని సిమెంట్ పరిశ్రమను సుమారు 500 మిలియన్లు (50 కోట్లతో) 1984 వ సంవత్సరంలో ఏర్పాటు చేసినది. ఈ నెల 22న సిమెంటు ఫ్యాక్టరీకి చెందిన చివరి రెండు పొగ చిమ్నిలు టవర్లను తుక్కు స్క్రాప్ గా మార్చడంతో పరిశ్రమ సమాధిగా మారినది. కూల్చివేతలు జూన్ మాసంలో మొదలుపెట్టి సి.సి.ఐ అదిలాబాద్ పరిశ్రమ దశాబ్దాలుగా మూతపడిన ఫ్యాక్టరీకి చెందిన ఇనుము, రాగి మిగిలినది పరిశ్రమలోని భవనాల సముదాయాన్ని కూల్చివేత ప్రక్రియతో స్థానిక యువత ఉపాధి కలలు నేలమట్టమయ్యాయి. దీనితో పాలకుల నిర్లక్ష్యంతో పారిశ్రామిక కళ తప్పినది. ఈ తుక్కు కింద టెండర్లను ఢిల్లీకి చెందిన హెచ్.ఆర్ అనే సంస్థ దక్కించుకొని కూల్చివేతలు పూర్తి చేసి తరలిస్తున్నారు. 1984 సంవత్సరంలో రోజుకు 1200 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో 700 ఎకరాల్లో మొత్తం 2340 ఎకరాల్లో నాలుగు వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించడం ఇందులో 450 మంది సాధారణ ఉద్యోగులు, ఒప్పంద ఆధారిత కార్మికులు 2000 మందితో ఏర్పాటు చేసినారు. ఈ సిమెంటు పరిశ్రమ యూనిట్ దేశంలోని ఇతర యూనిట్లకు ఉత్పత్తిలో గట్టి పోటీని ఇచ్చినది. 1991లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకువచ్చిన పారిశ్రామిక సంస్కరణల మూలంగా ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీకి వినాశకరమైన ప్రభావాన్ని చూపించినది. కేంద్రం వాటా నిర్వహణ మూలధనం నిలిచిపోయినది మరియు ఉత్పత్తి ఆయన సిమెంటులో 60% శాతం కేంద్ర ప్రభుత్వం కొనుగోలు మానివేసేయడం మూలంగా ఫలితంగా నిర్వహణ నష్టాల కారణంగా ఖాయిలా కింద 1998 నవంబర్లో ఈ పరిశ్రమ ను పాక్షికంగా మూసి వేసినారు. సిమెంట్ పరిశ్రమ కొరకై మూడు పంటలు పండే నల్లరేగడి భూమిల్ని త్యాగం చేసిన బెల్లూరి,లాండ సాంగ్వి, ఖానాపూర్,అనుకుంట గ్రామ రైతులు పరిశ్రమకు భూముల సేకరణలో భాగంగా ఇంటికొక ఉద్యోగము 100 సంవత్సరాలకు గ్యారెంటీతో పాటు ఎకరానికి రెండు వేల నుంచి 3000 వెల రూపాయలు నష్ట పరిహారం చెల్లించినారు నేడు ఆ భూములు ఎకరాకి మూడు నుండి ఐదు కోట్ల పైన మార్కెట్ ధర కలదు. పునరుద్ధరణకై రిలే నిరాహార దీక్ష చేసిన సిసిఐ సాధన సమితిలో రైతులు కూడా పరిశ్రమ కొరకు ఇచ్చిన భూములు పరిశ్రమ మూత పడినది కాబట్టి తిరిగి రైతులకు స్వాధీనం చేయాలని డిమాండు చేయడంతో పాటు నిరాశలో ఉన్నారు. అదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ ఉత్పత్తిలో అదిలాబాద్ జిల్లాకు ఎక్కడ లేని విధంగా మౌలిక వనరులు, అవస్థాపన సౌకర్యాలైన జాతీయ రహదారి 44 (పాత ఎన్.హెచ్ 7), రైల్వే లైన్ ముంబై-నాగపూర్ బ్రాడ్ గేజ్ విద్యుత్ లైన్ ఇటీవల ఫిట్ లైను కూడా నిర్మాణం పూర్తయి రైళ్ల సంఖ్య కూడా పెరుగుతుంది. దీనివల్ల ఉత్పత్తి అయిన సిమెంటుని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయవచ్చు. అలాగే ఇటీవల అదిలాబాద్ ఎయిర్పోర్టును పునఃప్రారంభానికి అనుమతులు రావడం ఏర్పోర్ట్ కు కావాల్సిన మిగిలిన భూమిని సేకరణకు పనులు కూడా మొదలు పెట్టింది. అంటే జాతీయ రహదారి, రైల్వే, వాయు సేవల సకల సౌకర్యాలతో పాటు పరిశ్రమకి ముడి సరుకు అయిన సున్నపు రాయి 100 సంవత్సరాలకు పైనే సరిపడా 50 మిలియన్ టన్నుల పైన నిల్వలు కలిగి ఉండటం, అలాగే పరిశ్రమకు దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో అత్యధిక నీటి వనరులు కలిగిన సాత్నాల ప్రాజెక్టు, మత్తడి వాగు ప్రాజెక్టు, కోరాట-చనాక పెన్ గంగా ప్రాజెక్టులలో సమృద్ధిగా నీరు ఉండడం వల్ల సిసిఐ పరిశ్రమ అవసరాలకు సరిపడా కలవు. మైదాన ప్రాంతం మరియు గిరిజన నిరుద్యోగ యువత కూడా సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ జరిగితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరికితే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి రాదు అనుకున్నారు. ఇప్పటికీ అదిలాబాద్ జిల్లాకు కావాల్సిన సిమెంటును మహారాష్ట్రలోని చంద్రపూర్ నుండి ప్రతిరోజు వేల టన్నులు దిగుమతి జరుగుతున్నది మరి ఇక్కడ అన్నీ ఉండి కూడా అల్లుడి నోట్లో శని అని అన్నట్టు పరిశ్రమను మూత పడవేసినారు. పునరుద్ధరణలో లోపం ఎక్కడ ఉంది! వెనుకబడిన జిల్లాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు చిన్న చూపు చూస్తున్నాయి అనేది జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నేటి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సిసిఐ పరిశ్రమను పునరుద్ధరిస్తామని ఆదిలాబాదు జరిగిన బహిరంగ సభలో 2018 నవంబర్ 28న జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలలో హామీ ఇవ్వడం, మళ్ళీ ఆ మరుసటి యేడాది అమిత్ షా భారత జనతా పార్టీ జాతీయ అధ్యక్షుని హోదాలో 2019 అక్టోబర్ 10న పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో మళ్లీ పునరుద్ధరణకై కార్మిక సంఘం నాయకులతో పాటు స్థానిక నాయకులకు హామీ ఇచ్చి నేడు మరిచిపోయినారు. ప్రస్తుతం కేంద్రంలో భాజపా ప్రభుత్వం ఉండడంతో పాటు అదిలాబాద్ అసెంబ్లీకి ప్రజలు ఆ పార్టీ అభ్యర్థి పాయల్ శంకర్ ను గెలిపించారు కానీ ఏరోజు సిమెంటు పరిశ్రమ సిసిఐ గురించి పురోధరణకై గట్టిగా మాట్లాడి ప్రయత్నం చేయలేదని జిల్లా ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

ఎమ్మెల్యే పైన కూడా సిసిఐ కార్మిక సంఘం, సీసీఐ పరిరక్షణ సమితి, ప్రతిపక్షాల పార్టీలు మరియు నిరుద్యోగ యువత పరిశ్రమకు భూముల్ని త్యాగం చేసిన రైతులు ఈ పరిశ్రమకు చెందిన భూములను ప్రైవేటుకు లేదా వేలం పాట ద్వారా అమ్మకానికి రాష్ట్ర ప్రభుత్వంతో చీకటి ఒప్పందం చేసుకున్నారని కూడా గుసగుసలు ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులుగా భారత జనతా పార్టీకి చెందిన గెడం నగేష్ ను గెలిపించినప్పటికీ ఏ రోజు కూడా తాను పార్లమెంటులో సిసిఐ పరిశ్రమ పునరుద్ధరణకై పార్లమెంటులో మాట్లాడలేదని యువత నిరుద్యోగులు ఆవేదనలో కలరు. దాదాపు నెలన్నర రోజులు "సిసిఐ సాధన సమితి" ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేయడంతో పరిశ్రమ పునఃప్రారంభం జరుగుతుందని జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలు, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పక్షాలు, ఇతరులు రిలే నిరాహార దీక్షలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపినారు. సీసీఐ పరిశ్రమను శాశ్వతంగా మూసి వేయడం వలన ఆర్థికంగా వందలాది కార్మికులు, ఉద్యోగాలు, ఇంజనీర్లు ఉపాధి కోల్పోవడం. ఫ్యాక్టరీలకి చుట్టుపక్కల గల హోటల్లో లారీలు, లారీల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, పెట్రోల్ పంపులు ఇతర వ్యాపారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టం వాటిల్లింది. ఈ మూసివేత వలన ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమకు కేటాయించిన సున్నపురాయి గనులు వృధాగా ఉండి పనికి రాకుండా పోతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సీఎం హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటానని ప్రకటించటం ప్రకటనలకే పరిమితమైనది. మరి దత్తత తీసుకున్నట్లయితే సిమెంటు పరిశ్రమ పునరుద్ధరణ జరిగి రాష్ట్ర తన వాటా, మాట పరిస్థితి, అనిచ్చితిలో మౌనంగా ఉండడంతో జిల్లా ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- (వ్యాస రచయిత:డా.తూము విజయ్ కుమార్, చరవాణి:9492700653)

తాగేందుకు నీళ్లు లేవు..



- బాత్రూంకూ బయటకే వెళ్లాల్సిన దుస్థితి..
- బషీరాబాద్ ఎస్సీ హాస్టల్‌లో నీటి కష్టాలు

(వికారాబాద్, సాక్షర): బషీరాబాద్ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. కనీసం తాగడానికి కూడా నీళ్లు అందుబాటులో లేవని, బాత్రూంకు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో నీటి సదుపాయం లేకపోవడంతో ఎదురుగా ఉన్న పోలీస్ స్టేషన్, పక్కనే ఉన్న ఎంఆర్‌సీ భవనం నుంచి నీటిని తెచ్చుకొని కాలకృత్యాలు తీర్చుకుంటున్నట్లు చెబుతున్నారు. విద్యార్థుల కథనం ప్రకారం.. హాస్టల్‌లోని బోరు ఏడాది క్రితమే పాడైపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు దానికి మరమ్మతులు చేయించలేదు. మరోవైపు మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్నప్పటికీ నీటి సరఫరా జరగడం లేదని వారు వాపోతున్నారు. బోరు మరమ్మతుల కోసం కలెక్టర్ నిధులు విడుదల చేసినప్పటికీ పనులు చేపట్టడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. తాగునీరు, కనీస అవసరాలకు కూడా నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బోరుకు మరమ్మతులు చేయించి, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగల చోరీ

- కేసులో ముగ్గురికి ఏడాది జైలు

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని విలువైన రాగి తీగలను దొంగిలించిన కేసులో ముగ్గురు నిందితులకు ఆదిలాబాద్ కోర్టు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. వివరాల్లో మహారాష్ట్ర రాష్ట్రం, యవత్మాల్ జిల్లా, వాణి గ్రామానికి చెందిన కినక శంకర్, చిందే స్వప్నిల్, హవల్దార్ ప్రకాష్ అనే ముగ్గురు నిందితులు 2019 ఆగస్టు 1వ తేదీ రాత్రి బేల మండలం పల్లాయి తండా గ్రామ శివారులో వ్యవసాయ భూములకు సంబంధించిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కింద పడదోసి, వాటిలోని విలువైన రాగి తీగలను దొంగిలించారు.ఈ ఘటనపై బేల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పక్కా సాక్ష్యాధారాలను సేకరించి నిందితులపై నేరం రుజువు చేసే విధంగా కోర్టులో ఆధారాలు సమర్పించారు.విచారణలో నేరం రుజువు కావడంతో ఆదిలాబాద్ II అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి చింతల దివ్యవాణి ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రభుత్వం తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షాహీన్ సుల్తానా వాదనలు వినిపించారు.నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి..1. కినక శంకర్ (25), తండ్రి జోతి రామ్, వాణి గ్రామం, యవత్మాల్ జిల్లా, మహారాష్ట్ర. 2) చిందే స్వప్నిల్ (22), తండ్రి విజయ్, వాణి గ్రామం, యవత్మాల్ జిల్లా, మహారాష్ట్ర.
3. హవల్దార్ ప్రకాష్ (20), తండ్రి రామా, వాణి గ్రామం, యవత్మాల్ జిల్లా, మహారాష్ట్ర వాసులు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసి, కోర్టులో పక్కా సాక్ష్యాధారాలు సమర్పించిన ప్రస్తుత బేల ఎస్హెచ్ఓ వై. మధు కృష్ణ, కోర్టు కానిస్టేబుల్ ఎం. నరేష్ కుమార్ లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు. నేరస్థులకు శిక్ష పడేలా పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు.

ఖాజీపేట మండలంలో రోడ్డు ప్రమాదం..

- ఒకరి పరిస్థితి విషమం
- చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం..
- ముగ్గురు యువకులకు గాయాలు

(ఖాజీపేట, సాక్షర): మండల పరిధిలోని పత్తూరు–రావులపల్లె గ్రామాల సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు యువకులు ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మిగిలిన ఇద్దరు యువకులకు కూడా గాయాలయ్యాయి. ప్రమాద తీవ్రతకు యువకులు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులకు సహాయం అందించారు.

రౌడీ షీటర్లపై సిరిసిల్ల పోలీసుల డేగకన్ను!



(రాజన్న సిరిసిల్ల, సాక్షర): జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల ఇళ్లలో పోలీసులు ఆకస్మిక రాత్రి తనిఖీలు నిర్వహించారు.ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హెచ్చరించారు. నేరాలకు దూరంగా సత్ప్రవర్తనతో జీవించాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. పూర్తిగా ప్రవర్తన మార్చుకున్న వారి షీట్లను నిబంధనల ప్రకారం తొలగిస్తామని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన ఖైరిగుర ఓపెన్ కాస్ట్

(రెబ్బెన,సాక్షర): సింగరేణి కాలరీస్ కంపెనీ మరోసారి జాతీయ స్థాయిలో తన సత్తా చాటింది.కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఏటా అత్యుతమ గనులకు 5 స్టార్ రేటింగ్ ఇస్తుంది.ఈ రేటింగ్ కోసం బొగ్గు గనుల పనితీరు,రక్షణ చర్యలు , నిర్వహణ,సౌకర్యాలు, పర్యవరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణలోకి తీసుకొని మార్కులను కేటాయిస్తారు.మొత్తం 100 మార్కులకు గాను 91కన్నా ఎక్కువ సాధించిన గనులకు 5స్టార్ రేటింగ్ ఇస్తారు.అందుకు గాను యాజమాన్యాలను అభినందిస్తూ ఈ అవార్డును అందించారు.అవార్డు రావడం పట్ల బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ.రమేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగుర ఉపరితల గని ఈ ప్రతిష్టాత్మక అవార్డును సాధించడం ఏరియాకు గర్వకారణమని పేర్కొన్నారు.ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు,కార్మికులందరికీ అభినందనలు తెలియజేస్తూ,భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఉత్పత్తి,భద్రత,పర్యావరణ పరిరక్షణలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ హర్షం వ్యక్తం చేసారు.కార్యక్రమంలో ఖైరిగుర ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.నరేందర్,ఖైరిగూడ ఫిట్ సెక్రటరీ మారం శ్రీనివాస్,ఎస్ఓ టు జిఎం ఇ.స్వామిరాజు,ఏరియా ఇంజనీర్ బి.వీరన్న,ప్రాజెక్ట్ మేనేజర్ జే.శంకర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దామోదర-లక్ష్మీకాంత రావులపై మహేష్ గౌడ్ సీరియస్ !

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ శృతిమించుతున్న గ్రూపు తగాదాలు, బాహాటంగా రచ్చకెక్కుతున్న క్రమశిక్షణా రాహిత్యంపై టీపీసీసీ నాయకత్వం గట్టిగా దృష్టి సారించింది. పార్టీ నేతల వివాదాలూ పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయా? పార్టీ సంస్థాగత నియామకాల విషయంలో నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు చివరకు బహిరంగ ఘర్షణకు దారితీసిందా? ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్ వేదికగా చోటుచేసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చిన ఘటన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు రైతుల సమస్యలు, మరోవైపు పార్టీ వ్యవహారాలు.. వీటన్నింటినీ పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీలోనే పరస్పరం తలపడినట్లు వస్తున్న వార్తలు పార్టీ ప్రతిష్ఠకు సవాలుగా మారాయి.పార్టీ అధికారంలో ఉన్న వేళ నేతలు సంయమనం పాటించాల్సింది పోయి.. వ్యక్తిగత ఆధిపత్యం, నామినేటెడ్ పదవులు, నియోజకవర్గ వ్యవహారాలపై పరస్పరం దాడులకు దిగడంపై ఆయన సీరియస్ అయ్యారు. అంతర్గత క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయి నేతలైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావుల వివాదాన్ని టీపీసీసీ చీఫ్ తీవ్రమైన అంశంగా పరిగణించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా హోటల్ లాబీలో డీసీసీ అధ్యక్ష పదవి, సంస్థాగత నియామకాల విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, సహచర ఎమ్మెల్యేల ముందే బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లడం పార్టీ వర్గాల్లో పెను దుమారం రేపింది. తోటి ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రి దామోదర తనపై తీవ్ర పదజాలంతో దూషణలకు దిగారని ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ వివాదంపై పూర్తి విచారణ జరిపేందుకు బుధవారం నాడు గాంధీ భవన్‌కు స్వయంగా హాజరుకావాల్సిందిగా మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావులకు పీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు.మంత్రి, ఎమ్మెల్యే వివాద పరిష్కారం తర్వాత.. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస క్రమశిక్షణా ఉల్లంఘనలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పీసీసీ నిర్ణయించింది. ఢిల్లీలోని శాంగ్రిలా హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామకాలకు సంబంధించి ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. తమ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న పట్టుదల, పార్టీ పదవుల పంపకాలపై అసంతృప్తి ఈ వివాదానికి కారణమన్న ప్రచారం జరుగుతోంది.ఈ క్రమంలో హోటల్ లాబీలోనే ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్లు సమాచారం. 'రూములో వేసి నీ గురించి ఏం అనుకుంటున్నావు?' అంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో ఇద్దరూ పరస్పరం దాడికి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వివాదం వెళ్లిందన్న వార్త రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.ఈ ఘటన సమయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఓ సీనియర్ జర్నలిస్ట్ అక్కడే ఉన్నట్లు సమాచారం. ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో మంత్రి తనను దూషించి అవమానించారని లక్ష్మీకాంతరావు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆయన ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా పార్టీ అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఈ వ్యవహారం నిజంగా ఎంతవరకు వెళ్లింది? ఇద్దరు నేతల మధ్య వివాదానికి అసలు కారణాలేమిటి? పార్టీ పెద్దలు ఈ అంశాన్ని ఎలా పరిష్కరిస్తారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయఈ ఘటన రాజకీయంగా మరో కీలక చర్చకు తెరలేపింది. తెలంగాణలో రైతులు వివిధ సమస్యలతో సతమతమవుతున్న సమయంలో అధికార పార్టీ నేతలు మాత్రం పార్టీ పదవులు, వర్గ రాజకీయాల కోసం ఢిల్లీలోనే ఘర్షణలకు దిగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు తమలో తాము ఆధిపత్య పోరుకు దిగడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి, ప్రజల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే మధ్యే సఖ్యత లేకపోతే పార్టీ కేడర్‌కు ఎలాంటి సందేశం వెళ్తుందన్నది మరో ప్రశ్న. జిల్లా స్థాయి పార్టీ పదవుల విషయంలోనే నేతలు సంయమనం కోల్పోతే, ప్రభుత్వ పాలనలో సమన్వయం ఎలా ఉంటుందన్న విమర్శలకు ఈ పరిణామం అవకాశం కల్పిస్తోంది.కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాకపోయినా, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అంతర్గత విభేదాలు ఇలాంటి స్థాయికి చేరుతున్నాయన్న ప్రచారం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఈ వివాదం పీసీసీ పరిధిలోనే ముగుస్తుందా? లేక ఢిల్లీ పెద్దల వరకు చేరుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.డీసీసీ అధ్యక్షుల నియామకాల కోసం మొదలైనట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మంత్రి, ఎమ్మెల్యే మధ్య వ్యక్తిగత ఘర్షణగా మారిందన్న వార్త కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రైతుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో నేతల మధ్య ఈ తరహా పరిణామాలు చోటుచేసుకోవడం పార్టీకి రాజకీయంగా ఎంతమేర నష్టం కలిగిస్తుందో వేచి చూడాలి.హోటల్‌లో జరిగినట్లు ప్రచారంలో ఉన్న ఘర్షణకు సంబంధించి ఇరువురు నేతల అధికారిక స్పందన, స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులోకి వచ్చిన తర్వాత పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.ప్రధానంగా నియోజకవర్గ నిధుల పంపిణీ, స్థానిక సంస్థల సమన్వయం, అధికార వర్గాల బదిలీల విషయంలో మంత్రులపై బహిరంగంగా గళమెత్తుతున్న అసంతృప్త ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల వ్యవహార శైలిపై పార్టీ అధిష్టానం నివేదికలు సిద్ధం చేస్తోంది. మునుగోడు, జడ్చర్ల వంటి స్థానాల్లో సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత్వంపై విరుచుకుపడుతుండటం, జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకాల వేళ వర్గపోరు భగ్గుమంటున్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఆయా నేతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీ చేయనున్నారు.

భీంపూర్ లో కరువు పరిస్థితులపై సీపీఐ క్షేత్ర పర్యటన



- ఎకరానికి లక్ష రూపాయల పంట నష్టపరిహారం ఇవ్వాలి
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి

(భీంపూర్, సాక్షర): మండలంలో కరువు పరిస్థితులను తెలుసుకోవడానికి సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా నాయకత్వం చేను చేనులకు తిరిగి గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించింది.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగిన ఈ పర్యటనలో రైతు కరువు పరిస్థితులు, పంటల పరిస్థితులపై చర్చించి, ప్రభుత్వంపై ఏ విధంగా పోరాటం చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకున్నారు.రైతులకు కనీసం పంట నష్టపరిహారం కింద 5 ఎకరాల లోపు భూమి ఉన్న వారికి ఎకరానికి ఒక లక్ష రూపాయలు, 5 ఎకరాల పైగా ఉన్న రైతుకు ఎకరానికి 60 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎకరానికి 30 వేల రూపాయలు కౌలు, పత్తి పంటకు కనీసం 30 వేల రూపాయలు ఖర్చు కాగా రెండు కలిపితే ఎకరానికి 60 వేల రూపాయల నష్టం జరిగిందని తెలిపారు.కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కరువును ప్రకటించినప్పటికీ రెండు ప్రభుత్వాలు కలిసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లేకపోతే తీవ్రమైన ఆందోళనకు సీపీఐ పార్టీ సిద్ధంగా ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కుంటాల రాములు, అద్దంకి రమేష్, షేక్ పాషా, ఖండాల గణేష్, షేక్ సలీం, నాయిని గంగాధర్, ఆలుగంటి లక్ష్మన్న, పోల్కం విట్టల్, కొల్లూరు సంతన్న, మగ్గిడి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

రిమ్మ గ్రామంలో ఘనంగా దండారి ఉత్సవాలు



- ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

(సిరికొండ, సాక్షర): సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో జరిగిన దండారి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో గ్రామం కోలాహలంగా మారింది.ఈ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీఓ మందా మకరందు, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఆదివాసీలతో కలిసి అధికారులు దండారి నృత్యంలో పాల్గొని ఉత్సవాల్లో ఉత్సాహం నింపారు. గ్రామస్తులు అధికారులకు ఘన స్వాగతం పలికారు.

దాశరథి కృష్ణమాచార్యకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నివాళులు

సాక్షర:తెలంగాణ సాహితీ సౌరభం, సంఘ సంస్కర్త దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. "నా తెలంగాణ కోటి రత్నాల వీణ" అంటూ తెలంగాణ వైభవాన్ని, ఆత్మగౌరవాన్ని తన అక్షరాల్లో ఆవిష్కరించిన మహాకవి అని స్మరించుకున్నారు.కలం ద్వారా కదనరంగాన్ని తలపించేలా, కవిత్వంతో ప్రజల్లో చైతన్య జ్వాలలు రగిలించి, తన సాహిత్యాన్ని తెలంగాణ విముక్తి పోరాటానికి అంకితం చేసిన అక్షర యోధుడు దాశరథి ని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించి, జైలు గోడల మధ్యన సైతం తన కలాన్ని ఆపని ధైర్యశాలి అని కొనియాడారు.అగ్నిధార, రుద్రవీణ వంటి రచనలతో తెలుగు సాహిత్యానికి చెరగని కీర్తిని అందించిన దాశరథి ఉద్యమ స్ఫూర్తిగా, సామాజిక చైతన్యంగా, తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.

బాత్రూంలో గంజాయి మొక్క..

- పోలీసుల దాడిలో బయటపడ్డ రహస్యం
- సోనాలలో గంజాయి మొక్క స్వాధీనం - నిందితుడిపై ఎన్.డీ.పీ.ఎస్ కేసు



(బోథ్, సాక్షర): మండలం సోనాల గ్రామంలో ఒక వ్యక్తి తన ఇంటి వెనుక ఉన్న బహిరంగ బాత్రూం ప్రదేశంలో గంజాయి మొక్కను పెంచుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బోథ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో సోనాల గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి వెనుక పెరట్లో ఒక గంజాయి మొక్కను గుర్తించారు. పరిశీలించి అది గంజాయి మొక్కగా నిర్ధారించారు. మొక్కను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి నిందితుడు చౌహాన్ జైపాల్ సింగ్ ను అరెస్టు చేశారు.నిందితుడు గతంలో గంజాయి సేవించే అలవాటు ఉండటంతో గంజాయి విత్తనాలను సేకరించి, డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రహస్యంగా మొక్కను పెంచుతున్నట్లు విచారణలో వెల్లడించాడు. ఈ ఘటనపై నిందితుడిపై ఎన్.డీ.పీ.ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం తెలిపారు.

తూప్రాన్‌లో పోలీసుల భారీ కార్డన్ సెర్చ్..

- 450కి పైగా ఇళ్లలో తనిఖీలు
- పత్రాలు లేని 64 వాహనాలు స్వాధీనం



(మెదక్, సాక్షర): నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా తూప్రాన్ పట్టణంలోని 2 బీహెచ్ కె కాలనీలో ఈరోజు మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డన్ సెర్చ్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 105 మంది పోలీసు సిబ్బంది పాల్గొని 450కు పైగా ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలు, 3 త్రిచక్ర వాహనాలు (మొత్తం 64) స్వాధీనం చేసుకున్నారు.మాదకద్రవ్యాల ఉనికిని గుర్తించేందుకు నార్కోటిక్ డాగ్ 'జూబి' సహాయంతో అణువణువూ తనిఖీలు చేశారు.ఫింగర్‌ప్రింట్ డివైజ్‌ల ద్వారా పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు."ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఉద్దేశం సాధారణ ప్రజలను ఇబ్బంది పెట్టడం కాదు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే. మీ పరిసరాల్లో ఎవరైనాఅనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి" అని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ , సీఐలు వెంకటరాజ్ గౌడ్, రంగకృష్ణ, ఎస్సైలు, సీసీఎస్, షీ టీమ్స్, డాగ్ స్క్వాడ్ బృందాలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు అనేక ప్రయోజనాలు



- ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా వ్యవసాయ అధికారి ఆసం రవి

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా వ్యవసాయ అధికారి ఆసం రవి అన్నారు. సోన్ మండల పరిధిలోని మాదాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, వివిధ బ్యాంకుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ యాంత్రీకరణ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రధానమంత్రి ఎంప్లాయ్ మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ), సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం), పీఎంఎఫ్ఎంఈ, అగ్రికల్చర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) వంటి పలు పథకాల ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాలకు అవసరమైన యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తున్నాయని వివరించారు.అంతేకాకుండా యువ రైతులు చిన్న, మధ్య తరహా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయాలు కల్పించడంతో పాటు వడ్డీ రాయితీలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు.మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్పీవోలు), రైతు సహకార సంఘాలు కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకునేందుకు 40 శాతం వరకు రాయితీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.రైతులు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, రాయితీలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్ అధికారుల బృందం రైతులకు ఆయా బ్యాంకులు అందిస్తున్న వివిధ వ్యవసాయ రుణాలు, పథకాలు, ఆర్థిక సహాయంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్య మల్లేష్, ఏఈఓ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, బ్యాంకు అధికారులు పుష్పలత, కిషోర్, అవినాష్, పవన్, భరత్ తో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

యూరప్ లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా



(ఆదిలాబాద్, సాక్షర): విదేశాల్లో అధిక జీతంతో డ్రైవర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని రూరల్ సీఐ రహీం పాషా తెలియజేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన ఎల్చల పోచన్న (20) జీవనోపాధి కోసం 2023లో సౌదీ అరేబియా వెళ్లి డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కల్లడి గ్రామానికి చెందిన మాలోత్ మహేష్ (34) అనే వ్యక్తి వాట్సాప్ కాల్ ద్వారా పోచన్నను సంప్రదించి, తాను యూరప్ లో ఉన్నానని, అక్కడ క్యాసినో హోటళ్లలో డ్రైవర్ ఉద్యోగాలు ఉన్నాయని, అధిక జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు.అతని మాటలు నమ్మిన పోచన్న తన తల్లి ఎల్చల అమ్మక్కకు విషయం చెప్పగా, ఆమె 22.10.2025న నిందితుడి బ్యాంకు ఖాతాకు రూ. 1,20,000 బదిలీ చేసింది. అనంతరం వీసా కోసం మరింత డబ్బు అవసరమని చెప్పడంతో మరో రూ. 12,000 కూడా చెల్లించారు. డబ్బులు తీసుకున్న నిందితుడు ఉద్యోగం, వీసా విషయాన్ని పదేపదే వాయిదా వేస్తూ చివరకు నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చి మోసం చేశాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు తలమడుగు పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 208/2026, సెక్షన్ 318(4), 316(5) బీఎన్ఎస్, సెక్షన్ 24(1)(బి) r/w 10 ఎమిగ్రేషన్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు నవంబర్ 05న ఆదిలాబాద్ బస్టాండ్ ప్రాంతంలో నిందితుడు మాలోత్ మహేష్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నేరానికి ఉపయోగించిన సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు.నిందితుడి మాలోత్ మహేష్ (34), తండ్రి చందు, కల్లడి గ్రామం, మాక్లూర్ మండలం, నిజామాబాద్ జిల్లా వాసిగా గుర్తించారు.విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను గుడ్డిగా నమ్మవద్దు. విదేశీ ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించే ముందు సంబంధిత ఏజెన్సీల గుర్తింపు, అనుమతులు, ఉద్యోగ వివరాలను పూర్తిగా పరిశీలించాలి. గుర్తింపు లేని ఏజెంట్లకు డబ్బులు చెల్లించి మోసపోవద్దు. ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ రహీం పాషా హెచ్చరించారు.కార్యక్రమంలో తలమడుగు ఎస్ఐ డి. రాధిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లగడపాటి శ్రీధర్ లాంచ్ చేసిన "యద్భావం తద్భవతి" చిత్ర టీజర్




రమేష్ జక్కల దర్శకత్వంలో ప్రసన్న లక్ష్మి భూమిరెడ్డి నిర్మాతగా ప్రసన్న భూమి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "యద్భావం తద్భవతి". వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇనయ సుల్తానా, రేణు శ్రీ హీరోయిన్స్ గా నటిస్తుండగా సుమన్, నాగ మహేష్, లోహిత్ కుమార్, ధనరాజ్, శ్వేత వర్మ, దయానంద్ రెడ్డి, శ్రీకాంత్ అయ్యంగర్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. శ్యామ్ సినిమాటోగ్రఫీ చేసిన ఈ చిత్రానికి మిహిరామ్ సంగీతం అందించగా ఈ చిత్ర పాటలను కే మ్యూజిక్ ద్వారా చిత్ర బృందం విడుదల చేస్తుంది. విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా "యద్భావం తద్భవతి" చిత్ర టీజర్ ను ప్రముఖ చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ గారి చేతుల మీదగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా లగడపాటి శ్రీధర్ గారు మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. ఇప్పుడే యద్భావం తద్భవతి చిత్ర టీజర్ చూసాను. ప్రసన్న లక్ష్మి భూమిరెడ్డి గారు నిర్మించిన ఈ చిత్ర టీజర్ చూస్తుంటే చిన్న సినిమా అయినప్పటికీ ప్రొడక్షన్ వాల్యూస్ చాలా బాగున్నట్లు అనిపిస్తుంది. అలాగే ఒక పాట కూడా చూడటం జరిగింది. రమేష్ జక్కల గారి దర్శకత్వం, మిహిరామ్ గారి సంగీతం చాలా బాగున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కళ పట్ల ఉన్న అభిమానంతో సినిమా తీయడం చాలా పెద్ద విషయం. ఈ సినిమాలో నటించిన వరుణ్ సందేశ్ అలాగే ఇతర నటీనటులకు చిత్ర బృందానికి నా అభినందనలు. లోహిత్, శ్రీకాంత్ అయ్యంగర్ వంటి ఎంతో సీనియర్ నటులు కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాను ప్రేక్షకులు అందరూ ఆదరించి నిర్మాత మరో సినిమా తీసేలా ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను" అన్నారు.
-నటీనటులు : వరుణ్ సందేశ్, ఇనయ సుల్తానా, రేణు శ్రీ, సుమన్, నాగ మహేష్, లోహిత్ కుమార్, ధనరాజ్, శ్వేత వర్మ, దయానంద్ రెడ్డి, శ్రీకాంత్ అయ్యంగర్ తదితరులు.

కిల్లర్" సినిమా త్వరలో ఓటీటీ లోకి



స్ట్రాంగ్ కంటెంట్ ఉంటే చిన్న చిత్రాలు కూడా పెద్ద విజయం సాధించగలవు అని మరోసారి ప్రూవ్ చేసింది "కిల్లర్". ఈ సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ ప్రీమియర్స్ తో కలిపి థియేట్రికల్ గా 2 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించింది. "కిల్లర్" సినిమా సాధించిన విజయం ప్రముఖ ఓటీటీ సంస్థల దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో ఒక ప్రముఖ ఓటీటీ సంస్థ ఈ చిత్ర ఓటీటీ హక్కులను ఫ్యాన్సీ ప్రైస్ కు సొంతం చేసుకుంది. ఒక చిన్న సినిమా థియేట్రికల్ రిలీజ్ తర్వాత ఫ్యాన్సీ ప్రైస్ తో జెట్ రైట్ గా ఒక పెద్ద ఓటీటీ సంస్థ హక్కులు తీసుకోవడం విశేషం. త్వరలో "కిల్లర్" సినిమా స్ట్రీమింగ్ కు రాబోతోంది."కిల్లర్" సినిమాలో జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటించారు. ఈ చిత్రంలో మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, అయినాబత్తిన దశరథ మాధవ్, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో కనిపించారు. "కిల్లర్" సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మించగా ..ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరించారు. పూర్వాజ్ దర్శకత్వం వహించి, ఒక ఇంపార్టెంట్ రోల్ చేశారు. దర్శకుడిగా, నటుడిగా పూర్వాజ్ ప్రేక్షకులను మెప్పించారు. త్వరలోనే ఓటీటీ ద్వారా "కిల్లర్" సినిమా మరింతమంది ప్రేక్షకులకు చేరువ కానుంది.నటీనటులు - జ్యోతి పూర్వజ్, పూర్వాజ్ , మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, అయినాబత్తిన దశరథ మాధవ్, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి, తదితరులు

టైసన్ నాయుడు' మూవీ 'మదరాసి రబ్బరు బొమ్మ' సాంగ్ నవంబర్ 6న రిలీజ్



(హైదరాబాద్, సాక్షర):యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టైటిల్ గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ను కిక్‌స్టార్ట్ చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'మదరాసి రబ్బరు బొమ్మ' ను నవంబర్ 6న విడుదల చేయనున్నారు. ఇది మాస్ ఫోక్ సాంగ్‌గా అలరించనుంది.తాజాగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ సంప్రదాయ ఫోక్ లుక్‌లో కనిపిస్తూ, కలర్ ఫుల్ బ్యాక్ డ్రాప్ లో సందడి చేయడం పాటపై మరింత ఆసక్తిని పెంచుతోంది.ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ను మునుపెన్నడూ చూడని యాక్షన్ ప్యాక్ క్యారెక్టర్ లో ప్రెజెంట్ చేస్తున్నారు డైరెక్టర్ సాగర్ కె చంద్ర.
టాప్ టెక్నీషియన్లు ఈ సినిమాకు పని చేస్తున్నారు. ముఖేష్ జ్ఞానేష్/అనిత్ డీవోపీ వ్యవహరిస్తుండగా, సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రానికి కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్‌లుగా వ్యవహరిస్తున్నారు. స్టన్ శివ, విజయ్, వెంకట్, రియల్ సతీష్ సినిమా యాక్షన్ కోరియోగ్రఫీ చేస్తున్నారు.

ఓ అందాల రాక్షసీ' సినిమాతో సమరానికి సిద్ధం: హీరో, దర్శకుడు షిరాజ్ మెహదీ



- సినీ పరిశ్రమలో యుద్ధం ప్రకటించిన షిరాజ్
- చిన్న సినిమాల హక్కుల కోసం ఎంతవరకైనా పోరాటం
- అవసరమైతే తెలంగాణ బంద్: షిరాజ్ మెహదీ

'ఓ అందాల రాక్షసీ' సినిమా థియేటర్ల సమస్య ఇప్పుడు పోరాటం నుంచి యుద్ధంగా మారిందని ఆ చిత్ర హీరో, దర్శకుడు, నిర్మాత షిరాజ్ మెహదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ సినిమాకు థియేటర్లు కేటాయించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ, న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఒక సినిమాను చంపడం అంటే అందులో పనిచేసిన వందల మంది జీవితాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సినిమా ఒక్కరిది కాదని, చిన్న బడ్జెట్ చిత్రాల సమస్యలన్నింటికీ ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. అవసరమైతే వంద ప్రెస్‌మీట్లు, ఇంటర్వ్యూలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పీవీఆర్, ఐనాక్స్, ఏషియన్ ఫిల్మ్స్ సంస్థలకు థియేటర్లు కేటాయించడం లేదంటూ ఇప్పటికే నోటీసులు పంపించామని, ఫిల్మ్ ఛాంబర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఛాంబర్ అధ్యక్షుడు మారడంతో న్యాయపరమైన ప్రక్రియను తిరిగి ప్రారంభించాల్సి వస్తోందన్నారు. సినిమా ఆడియో, ఓటీటీ, శాటిలైట్, డబ్బింగ్, ఓవర్సీస్ హక్కులతో పాటు థియేటర్ల ద్వారా వచ్చే ఆదాయంపై కూడా ఈ పరిణామాలు ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. తెలంగాణలో తెలుగు చిత్ర పరిశ్రమ వ్యవహారాలపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఫిల్మ్ ఛాంబర్ ఆధిపత్యం కొనసాగడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణ ప్రాంతంలో స్థానిక సినీ నిర్మాతలు, దర్శకులు, కళాకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో థియేటర్లు మూతపడటం, సినిమా షూటింగ్‌లు నిలిచిపోవడం వంటి పరిణామాలను గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో స్థానికులకు అన్యాయం జరగడాన్ని సహించబోమని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా పలుమార్లు తెలియజేశామని, నోటీసులు పంపించామని పేర్కొన్నారు. సమస్య తెలిసినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అవసరమైతే తెలంగాణ వ్యాప్తంగా సినీ పరిశ్రమకు సంబంధించిన వర్గాలను సమీకరించి ఆందోళనలు చేపడతామని, తెలంగాణ బంద్‌కు కూడా వెనుకాడబోమని ప్రకటించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ వ్యవహారశైలితోపాటు యూట్యూబ్, ఈఎఫ్ఓ మాఫియాపై కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ''మా ప్రాణాలైనా పోవాలి.. లేదంటే మా సినిమాకు పరిష్కారమైనా రావాలి. ఇది ఒక్క సినిమా సమస్య కాదు.. తెలంగాణలో చిన్న సినిమాల భవిష్యత్తుకు సంబంధించిన యుద్ధం. మంచిగా చెబితే వినడం లేదు.. త్వరలో మా పోరాటం ఏమిటో చూపిస్తాం. ఇది మా ప్రాంతం.. తెలంగాణ హక్కుల కోసం ఎంతవరకైనా వెళ్తాం'' అంటూ షిరాజ్ మెహదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. చివరగా 'జై తెలంగాణ.. జై హింద్' నినాదంతో తన ప్రసంగాన్ని ముగించారు.

15 మిలియన్ల వాచ్ టైమ్‌తో 'ఇట్స్ ఎ మెడికల్ మిరాకిల్' మూవీ



థియేటర్లలో మంచి స్పందనను పొందిన షరాఫుద్దీన్, సంగీత్ ప్రతాప్ నటిస్తున్న 'ఇట్స్ ఎ మెడికల్ మిరాకిల్' చిత్రం మనోరమా మాక్స్‌లో అద్భుతమైన ప్రారంభాన్ని సాధించింది. ఈ కామెడీ థ్రిల్లర్ ఓటిటి స్ట్రీమింగ్ విడుదలైన మొదటి వారంలోనే 15 మిలియన్ల నిమిషాలకు పైగా వాచ్ టైమ్‌ను నమోదు చేసింది. ప్రస్తుతం ఈ సినిమా మలయాళం, తమిళం, తెలుగు మరియు కన్నడ భాషల్లో ప్రత్యేకంగా మనోరమా మాక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ నాలుగు భాషల ప్రేక్షకులను అలరిస్తోంది. డెబ్యూ డైరెక్టర్ శ్యామిన్ గిరీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, ఒక వినూత్నమైన కథాంశాన్ని హాస్యం ఇంకా ఊహించని ట్విస్టులతో అద్భుతంగా తెరకెక్కించింది.'ప్రేమలు' చిత్రంలో అమల్ డేవిస్‌గా, 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్'లో జోయెల్‌గా గుర్తింపు తెచ్చుకున్న సంగీత్ ప్రతాప్ ఈ చిత్రంలో తొలిసారిగా లీడ్ రోల్‌లో నటించగా, షరాఫుద్దీన్ ఒక కీలక పాత్రలో కనిపించారు. కోమాలో నుంచి అద్భుతంగా కోలుకుని, దూరం నుంచి వచ్చే శబ్దాలు, సంభాషణలను వినే అసాధారణ శక్తిని పొందిన రూబిన్ (సంగీత్ ప్రతాప్) చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సూరజ్ (షరాఫుద్దీన్) అనే స్నేహపూర్వక పోలీసు అధికారిని కలవడం వల్ల జరిగే ఊహించని పరిణామాలు ఈ చిత్రంలో కామెడీ, సస్పెన్స్‌ను జోడిస్తాయి. ఈ చిత్రంలో షరాఫుద్దీన్, సంగీత్ ప్రతాప్‌లతో పాటు అఖిల భార్గవన్, పార్వతి ఆర్. కృష్ణ, కోట్టాయం నసీర్, ఆనంద్ మన్మధన్, కిరణ్ పీతాంబరన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.
'కరిక్కు' ఫేమ్ నీలీన్ సంద్ర ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, సంభాషణలు అందించారు. డా. పాల్స్ ఎంటర్‌టైన్‌మెంట్, డ్రీమ్ బిగ్ ఫిలిప్స్ బ్యానర్లపై డా. పాల్ వర్గీస్, సుజిత్ జే నాయర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అఖిల్ జేవియర్ సినిమాటోగ్రఫీ అందించగా, రాకేష్ చెరుమడం ఎడిటర్‌గా వ్యవహరించారు. ముజీబ్ మజీద్ సంగీతం సమకూర్చగా, నిక్సన్ జార్జ్ సౌండ్ డిజైనర్‌గా పనిచేశారు.మనోరమా మాక్స్ 500కి పైగా బ్లాక్‌బస్టర్ సినిమాలు, 20,000 గంటలకు పైగా కంటెంట్ & మజవిల్ మనోరమా, మనోరమా న్యూస్ నుండి ప్రీమియం ప్రోగ్రామింగ్‌తో విస్తృతమైన వినోదాన్ని అందిస్తోంది. ప్రత్యేకమైన కథాంశం, హాస్య భరితమైన క్షణాలు, ఒక అసాధారణ శక్తి చుట్టూ తిరిగే ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమా అనుభూతిని ఇస్తుంది. థియేట్రికల్ రన్ & ఓటీటీలో బలమైన ఆరంభం తర్వాత, ఈ సినిమా ఇప్పుడు మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో మనోరమా మాక్స్‌లో ప్రత్యేకంగా స్ట్రీమింగ్ అవుతోంది.

యంగ్ టైగర్ ఎన్టీఆర్ లాంచ్ చేసిన 'ఇట్లు అర్జున' సినిమా ట్రైలర్



(హైదరాబాద్, సాక్షర):కింగ్ నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న 'ఇట్లు అర్జున' చిత్రంతో కొత్త హీరో అనీష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకీ కుడుముల నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే గ్లింప్స్, టీజర్, పాటలతో మంచి బజ్ క్రియేట్ చేసిన మేకర్స్ తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు.యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ.. " ఒక్క మాట కూడా మాట్లాడకుండా డెబ్యూ సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించడం అనీష్ రియల్ గట్స్ కి నిదర్శనం. నీ మొదటి సినిమాకే ఇలాంటి పాత్రను ఎంచుకోవడం చూస్తుంటే, అన్నింటికంటే కథపై నీకు ఎంత నమ్మకం ఉందో అర్థమవుతోంది. నీకు అద్భుతమైన ఆరంభం లభించాలని కోరుకుంటున్నాను బ్రదర్. చిత్ర బృందం మొత్తానికి నవంబర్ 13న విడుదల కానున్న మీ సినిమాకు నా శుభాకాంక్షలు" అని ట్వీట్ చేశారు.ట్రైలర్ పోలీసుల వేటతో ప్రారంభమవుతుంది. ఓ దొంగను పట్టుకునేందుకు పోలీసులు అతడి కోసం పక్కా ప్లాన్ తో గాలిస్తుంటారు. ఈ విచారణలోకి అర్జున్ అనే మూగ యువకుడు ఎంటర్ అవుతాడు. అతను మాట్లాడలేకపోయినా, అసాధారణమైన తెలివితేటలు కలవాడని స్థానికులు చెబుతుంటారు. అద్భుతమైన తెలివితేటలతో పాటు, అర్జున్ మనసులో కీర్తిపై మాటల్లో చెప్పలేనంత ప్రేమ ఉంటుంది. అయితే, కొంతకాలానికే ఈ జంట ప్రమాదకరమైన పరిస్థితుల్లో చిక్కుకుంటుంది. పోలీసులు, గూండాల ముఠా ఇద్దరి కోసం వేట మొదలుపెడతారు. ఒక మిస్టీరియస్ పెన్‌డ్రైవ్, ఏకంగా రూ.1,000 కోట్ల డీల్.. ఈ ఆసక్తికరమైన వేటకు ప్రధాన కారణాలుగా నిలుస్తాయి.
దర్శకుడు మహేష్ ఉప్పల అన్ని కమర్షియల్ అంశాలను చక్కగా మేళవిస్తూ రొమాన్స్, యాక్షన్, కామెడీ, సస్పెన్స్‌తో కూడిన ఆసక్తికరమైన లవ్ స్టోరీని థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో రూపొందించారు. కథను చెప్పిన విధానం, ప్రజెంట్ చేసిన తీరు చూస్తే ఆయనకు కథనంపై ఉన్న పట్టును అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా అర్జున్ అసలు గుర్తింపును ట్రైలర్‌లో రివీల్ చేయకుండా సస్పెన్స్‌ను కొనసాగించారు. అర్జున్ నిజంగానే దొంగనా? అనుకోకుండా ఓ ప్రమాదంలో చిక్కుకున్న అమాయకుడా? లేక అతడి గతం వెనుక ఎవరూ ఊహించని రహస్యం ఏదైనా ఉందా? రూ.1,000 కోట్ల డీల్‌కు అర్జున్‌కు ఉన్న సంబంధం ఏమిటి? ఆ పెన్‌డ్రైవ్‌లో ఉన్న రహస్యాలేంటి? పోలీసులతో పాటు గూండాలు కూడా హీరో, హీరోయిన్‌ను వెంటాడుతున్న నేపథ్యంలో ట్రైలర్ ఎన్నో ఆసక్తికరమైన ప్రశ్నలను ప్రేక్షకుల ముందుంచింది.
హీరో అనీష్ తన నటనతో అద్భుతమైన ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. కొత్త హీరోలా ఎక్కడా కనిపించలేదు. ముఖ్యంగా మూగ పాత్రలో నటించడం చాలా ఛాలెంజింగ్. మాటలు లేకుండా కేవలం ఫేస్ ఎక్స్ ప్రెషన్స్, బాడీ లాంగ్వేజ్‌తోనే భావోద్వేగాలను, ఆలోచనలను వ్యక్తపరచాలి. అలాంటి ఛాలెంజింగ్ పాత్రను అనీష్ ఎంతో అద్భుతంగా పోషించారు. స్టైలిష్ లుక్, ఎక్స్‌ప్రెసివ్ ఫేస్, ఇంప్రెసివ్ స్క్రీన్ ప్రెజెన్స్, సహజమైన నటనతో అద్భుమైనన కొత్త టాలెంట్‌గా ఆకట్టుకున్నారు. యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ, ముఖ్యంగా హై ఎనర్జీ ఛేజింగ్ సన్నివేశాల్లోనూ ఎంతో ఈజ్‌తో నటించి, పెర్ఫార్మెన్స్‌తో పాటు యాక్షన్‌లోనూ ఆకట్టుకున్నారుఅనస్వర రాజన్ తన చార్మింగ్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఆమె పాత్ర అమాయకంగా, క్యూట్‌గా కనిపిస్తూనే బలమైన భావోద్వేగాలను కూడా కలిగి ఉంది. అర్జున్‌ను ఎదురుదాడి చేయమని ప్రోత్సహించడం, తమ చుట్టూ ఉన్న ప్రమాదాల గురించి ఆందోళన వ్యక్తం చేయడం.. ఇలా తన సహజమైన క్యూట్‌నెస్‌ను కొనసాగిస్తూనే పాత్రలోని భావోద్వేగాలను చక్కగా పలికించారు. దీంతో ఆమె పాత్ర ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అవుతుంది.రాజా మహదేవన్ సినిమాటోగ్రఫీ రొమాంటిక్ సన్నివేశాలను ఎంతో అందంగా చూపించడంతో పాటు, థ్రిల్లింగ్ సన్నివేశాలకు అవసరమైన ఇంటెన్స్ తీసుకొచ్చింది. ఎస్. థమన్ సంగీతం ప్రేమకథకు, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చక్కగా ఆవిష్కరిస్తూ కథనాన్ని మరింత ఆసక్తికరంగా మార్చింది. నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. ప్రేక్షకులకు మంచి క్వాలిటీ ఎంటర్‌టైనర్ అందించాలనే మేకర్స్ నిబద్ధత ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది.మొత్తంగా ఆసక్తికరమైన కథాంశం, ఫ్రెష్ లీడ్ పెయిర్, స్టైలిష్ యాక్షన్, సస్పెన్స్‌తో 'ఇట్లు అర్జున' ట్రైలర్ అంచనాలను మించిపోయింది. రొమాన్స్, థ్రిల్స్, ఎమోషన్స్, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ కలగలిపిన కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా అలరించనుంది. నవంబర్ 13న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ట్రైలర్‌తో అంచనాలు మరింత పెరిగాయి.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు 'ఉన్నతి విద్య' దోహదం



• విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: కలెక్టర్ రాజర్షి షా

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు సర్వతోముఖాభివృద్ధికి 'ఉన్నతి విద్య' కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని మసూద్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలక్‌మందిర్) పీఎం శ్రీ పాఠశాలలో 'ఉన్నతి విద్య' కార్యక్రమాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఉన్నతికి బాట.. విద్యతో ప్రయాణం – అభ్యసనం, అభివృద్ధి, విజయం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పటిష్టమైన విద్యా పునాది కల్పిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం కలెక్టర్ పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించడంతో పాటు బోధనా విధానాలు, పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలకు సమాధానాలిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, సెక్టోరల్ అధికారులు లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోకాపేట పెరిక భవన నిర్మాణానికి రూ. 2 కోట్ల ప్రభుత్వ నిధుల జీవో



• జీవో కాపీని పెరిక సంఘం ప్రతినిధులకు అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

(హైదరాబాద్/ ఆదిలాబాద్, సాక్షర):కోకాపేటలో నిర్మాణంలో ఉన్న పెరిక కుల ఆత్మగౌరవ భవనానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిన జీవో కాపీని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర పెరిక సంఘం ప్రతినిధులకు అందజేశారు.హైదరాబాద్ బంజారాహిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో ఈరోజు బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలకు సంబంధించి ప్రభుత్వ నిధుల జీవోలు అందజేసే కార్యక్రమంలో భాగంగా, పెరిక భవనానికి మంజూరైన రూ. 2 కోట్ల జీవో కాపీని పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు సమక్షంలో రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షులు గటిక విజయ్ కుమార్, గౌరవ అధ్యక్షులు మద్దా లింగయ్య, కోకాపేట భవన నిర్మాణ కమిటీ చైర్మన్ సుందరి వీరభాస్కర్, మాజీ వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షులు గటిక విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన స్థలం అత్యంత లోతట్టు ప్రాంతంలో ఉండటంతో స్థలాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకోసం అదనంగా మరో రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవిలను కోరారు. దీనిపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుంకరి ఆనంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్, రాష్ట్ర కోశాధికారి సందెల లింగం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బందు శ్రీధర్ బాబు, పెరిక విద్యార్థి వసతి గృహం ప్రధాన కార్యదర్శి అచ్చా రఘుకుమార్, వసతి గృహం కోశాధికారి బాల్దూరి రవికుమార్, ఎల్బీనగర్ జోన్ అధ్యక్షులు బుద్దె వెంకటేశ్వర్లు, ఎల్బీనగర్ జోన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రంశెట్టి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ లో నిధుల మంటలు

హైదరాబాద్ రేడియల్ రోడ్ల టెండర్ల విషయంలో ఏపీకి చెందిన కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని, లోకల్ కాంట్రాక్టర్లను పక్కనబెట్టారని రాజగోపాల్ రెడ్డి నేరుగా సీఎంఓ నిఘా, టెండర్ల కేటాయింపులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడం కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. మరోవైపు, జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడం, ఫండ్స్ విడుదల కాకపోవడంతో అనిరుధ్ రెడ్డి ఆమరణ దీక్షకు హెచ్చరికలు జారీ చేసే దాకా పరిస్థితి దాటింది.అయితే, ఈ ఇద్దరి అసంతృప్తుల వెనుక పొలిటికల్ అజెండాలు ఉన్నాయనే భావనతో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కోటరీ దీనిని లైట్ తీసుకుంటున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజగోపాల్ రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇమేజ్ ఉన్నప్పటికీ, ఆయన గతంలో పార్టీ మారిన నేపథ్యం ఉండటంతో హైకమాండ్ వద్ద ఆయన ఒత్తిళ్లకు తలొగ్గకూడదని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. సీనియర్లకు పదవులు ఇస్తూ పోతే కొత్తగా వచ్చిన వారికి లేదా రేవంత్ విధేయులకు అవకాశాలు దక్కవనే వ్యూహంతోనే వీరి కామెంట్లను ప్రభుత్వం తీవ్రంగా పట్టించుకోకుండా ఉపేక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ఇద్దరు ప్రజాప్రతినిధులు రోడ్డెక్కి విమర్శలు చేస్తుంటే, వారికి సర్దిచెప్పడంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేదా పార్టీ సీనియర్ నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అసంతృప్త నేతలను పిలిచి మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, అసమ్మతి వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఉంటాయంటూ హెచ్చరికలు జారీ చేయడం మంటలపై నెయ్యి పోసినట్లు పనిచేస్తోంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించాల్సిన సమస్యలు మీడియా ముందుకు రావడం చూస్తుంటే, పీసీసీ అధ్యక్షుడికి , ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంతర్గత తిరుగుబాటు రూపంలో పెద్ద చికాకులు తప్పవు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఓపెన్‌గా గళం విప్పుతుండటంతో, లోలోపల నిధులు రాక, హామీలు నెరవేర్చలేక సతమతమవుతున్న మరికొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వీరికి మద్దతుగా నిలిచే అవకాశాలు లేకపోలేదు. అసెంబ్లీలో మెజారిటీకి ముప్పు లేకపోయినప్పటికీ, స్వపక్ష ఎమ్మెల్యేలే రెబెల్స్ గా మారి అవినీతి, నిధుల మళ్లింపు ఆరోపణలు చేస్తే.. అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు ఉచితంగా పొలిటికల్ ఆయుధాలను అందించినట్లవుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులకు నిధుల కొరత, ప్రాధాన్యతలేమి అనేది కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలకే పరిమితమైన సమస్య కాదు. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి అసంతృప్త నేతలతో సమావేశమై టెండర్లు, నిధుల విడుదల మరియు పదవుల భర్తీపై స్పష్టమైన భరోసా ఇవ్వకపోతే, ఈ చిన్న నిప్పు రాబోయే రోజుల్లో రేవంత్ సర్కార్ స్థిరత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసే పెద్ద దావానలంగా మారే ప్రమాదం ఉంది.

ఆచరణాత్మక శిక్షణ ద్వారా మహిళలు విద్యాపరంగా, ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

• వయోజన విద్య ఉప సంచాలకులు ఏ. పురుషోత్తం

(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర): అక్షర వాలంటీర్లకు అక్షర వికాసం వాచకంలోని పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు, అభ్యాస కార్యక్రమాలు, నూతన అక్షరాస్యులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు నేర్పించే విధానాలపై ఆచరణాత్మక శిక్షణ ద్వారా మహిళలు విద్యాపరంగా, ఆర్థికంగా స్వావలంబన సాధించాలని వయోజన విద్య ఉప సంచాలకులు ఏ. పురుషోత్తం సూచించారు.బుధవారం మోస్రా మండలంలోని గోవూర్ గ్రామంలో వయోజన విద్యాశాఖ, స్నేహ సొసైటీ సౌజన్యంతో ఉల్లాస్ - నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా కుట్టు శిక్షణ పొందుతున్న అక్షర వాలంటీర్లకు అక్షర వికాసం వాచకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వయోజన విద్య ఉప సంచాలకులు ఏ. పురుషోత్తం, గోవూర్ సర్పంచ్ రవి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, ఎంఈఓ నాగనాథ్, ఎంపీఓ, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ రాములు అక్షర వాలంటీర్లకు అక్షర వికాసం వాచకంలోని పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు, అభ్యాస కార్యక్రమాలు, నూతన అక్షరాస్యులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు నేర్పించే విధానాలపై ఆచరణాత్మక శిక్షణ అందించారు.అలాగే ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులపై కూడా చర్చించారు. కుట్టు శిక్షణతో పాటు అక్షరాస్యతను పెంపొందించుకోవడం ద్వారా

రేపటి నుండి అర్వపల్లి దర్గా ఉత్సవాలు



(అర్వపల్లి, సాక్షర): మత సామరస్యానికి ప్రతికగా నిలిచే అర్వపల్లి శివారులో కొలువైన హజ్రత్ సయ్యద్ ఖాజా నసిరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు రేపు ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. ఈ ఉర్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వేలాది భక్తులు తరలిరానున్నారు. వక్ఫ్ బోర్డు, జిల్లా అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో పూజలు చేసి గంధాన్ని అత్యంత వైభవంగా భక్తుల నడుమ దర్గాకు తీసుకురానున్నారు. అనంతరం అర్ధరాత్రి ఖావ్వాలి నిర్వహిస్తారు. 7వ తేది శనివారం బాబా సన్నిధిలో భక్తిశ్రద్ధలతో చిరాగ్ కార్యక్రమం జరుగుతుంది. ఈ ఉర్సుకు ముస్లింలతో పాటు హిందువులు కూడా హాజరై బాబాని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. జాతీయ రహదారి నుండి దర్గాకి వెళ్లే దారి గుంతలు పడి ఉండడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఉర్సుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ అమీర్ అహ్మద్, జిల్లా ఇన్‌స్పెక్టర్ దస్తగిరి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్ఐలు, వంద పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి



• మండల ప్రత్యేక అధికారి జె. సునీత

• సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

(గుడిహత్నూర్, సాక్షర): ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి అని మండల ప్రత్యేక అధికారి జె. సునీత అన్నారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీడీవో ఇంతియాజ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి జె. సునీత హాజరయ్యారు.ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధి, తాగు నీటి సరఫరా, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు అన్నారు.మండలంలోని ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించాలని, మిషన్ భగీరథ నీరు వృధాగా పోకుండా ప్రతి నల్లాకు తప్పనిసరిగా ట్యాప్ బిగించాలని, ట్యాప్ బిగించకుండా నీటిని వృధా చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం జరిమానా విధించాలని సర్పంచులకు మిషన్ భగీరథ ఏఈ ప్రణయ్ సూచించారు.భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా రైతులు రెండో పంట సాగు చేయకుండా నీటిని ఆదా చేయడంపై దృష్టి సారించాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రమేష్ భగత్ అన్నారు.ఎల్ నినో ప్రభావంతో కరువు ఏర్పడడంతో ఖాళీగా ఉండకుండా మండలంలోని ఉపాధి హామీ కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్యాముల్ అన్నారు.ఎల్ నినో దృష్ట్యా ప్రతి ఒక్కరు విద్యుత్ ఆదా చేయాలని, గృహ జ్యోతి పథకంలో భాగంగా మండలంలో ఇంకా ఎవరిదైనా కరెంటు ఉచితం కాకపోతే మండలంలోని విద్యుత్ ఆఫీసులోకి వచ్చి అధికారులకు తెలియజేయాలని విద్యుత్ శాఖ ఏఈ గౌతమ్ తెలిపారు.గుడిహత్నూర్ మండలాన్ని మధ్యస్థ కరువు మండలంగా కాకుండా పూర్తిగా కరువు మండలంగా ప్రకటించాలని మండలంలోని సర్పంచులు తీర్మానం చేశారు.మండలంలోని అంగన్వాడి ఆయాలకు కొన్ని నెలల నుంచి జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మచ్చాపూర్ గ్రామంలోని డీఎన్టీ పాఠశాలలో 70 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, అక్కడ ఉపాధ్యాయులను నియమించాలని మచ్చాపూర్ సర్పంచ్ రాథోడ్ ప్రతాప్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఆడే శీలా, బోడ్కే మీనా, రాథోడ్ ప్రతాప్, జితేందర్, జాదవ్ నిశాంత్, జాదవ్ రాంజీ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

నాతో చర్చకు వస్తే మోదీ దేశ ద్రోహి అని ఐదు నిమిషాల్లో నిరూపిస్తా

దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడేళ్ల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో లేదో..? అని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. తాను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నానని, అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి..? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి..? అని ప్రశ్నించారు. మీరు పైకి శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారని, కానీ మీరు గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసని అమిత్ షాను ఉద్దేశించి అన్నారు. ఒకవేళ అమిత్ షా శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే మణిపుర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పాలని రాహుల్‌గాంధీ అన్నారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్‌పైనా రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ వారు ఎక్కడ నిర్మూలించారని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను నిర్మూలించారా..? అని నిలదీశారు. సమస్యను అంతంచేసే సామర్థ్యం వారికి లేదని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. గతంలో లోక్‌సభలో భగవంత్ మాన్‌తో కలిసి కూర్చున్న సమయంలో ఆయన జోకులు వేసేవారని, ఆయన వద్ద మద్యం వాసన వచ్చేదని ఆరోపించారు. మాదక ద్రవ్యాలపై పోరాడలనుకుంటే ముఖ్యమంత్రి మద్యం మత్తులో ఉండకూడదని మాన్‌కు రాహుల్ చురకలంటించారు. సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సచిన్ పైలట్ కూడా పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలో వాచ్‌మెన్ అనుమానాస్పద మృతి

(కేసముద్రం, సాక్షర): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బెరువాడ సమీపంలోని కాకతీయ గ్రానైట్ క్వారీలో వాచ్‌మెన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. క్వారీలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న దారం లక్ష్మీనారాయణ (60) మృతదేహం క్వారీలోని ఓ రేకుల షెడ్‌లో లభ్యమైంది. విధుల్లో ఉన్న సమయంలోనే మృతి చెందడంతో ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అయితే ఆయన మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీసుల విచారణ అనంతరం మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలవు

• 10వ తేదీ నుంచి తిరిగి కొనుగోళ్లు ప్రారంభం

(ఆదిలాబాద్, సాక్షర): దీపావళి పండుగ, అమావాస్య సందర్భంగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలవు ప్రకటించారు.ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు.తేదీ 08.11.2026 ఆదివారం దీపావళి పండుగ, తేదీ 09.11.2026 సోమవారం అమావాస్య సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు ఉంటుందని తెలిపారు.ఈ రెండు రోజులు పత్తి రైతులు సరుకును మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని సూచించారు.తిరిగి తేదీ 10.11.2026 మంగళవారం నుంచి కొనుగోళ్లు యథావిధిగా ప్రారంభమవుతాయని తెలిపారు. రైతులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

మురసు తుపాను ఎఫెక్ట్..

ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఉభయ రాష్ట్రాల అధికారులు అందుబాటులోకి వచ్చిన అనంతరం తదుపరి తేదీని వెల్లడిస్తామని బోర్డు స్పష్టం చేసింది. నిజానికి ఈ సమావేశం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. తొలుత అక్టోబరు 1న, అనంతరం అక్టోబరు 26న నిర్వహించాలని భావించినప్పటికీ వీలుపడలేదు. గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటన కారణంగా వాయిదా పడగా, తాజాగా తుపాను పరిస్థితుల దృష్ట్యా మరోసారి వాయిదా పడింది. ఈ తాజా వాయిదాతో ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న కీలకమైన కృష్ణా జలాల పంపిణీ, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ, తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులు వంటి అంశాలపై చర్చలు మరోసారి నిలిచిపోయాయి. తదుపరి సమావేశం ఎప్పుడు

యువతకు నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు



- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- ఆర్ఎస్ఈటీఐ కేంద్రాన్ని త్వరగా ఏర్పాటు చేయాలి

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్ఎస్ఈటీఐ) ఏర్పాటుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.గురువారం ఆయన దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాన్ని సందర్శించి, శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అనువైన భవన సదుపాయాలు, ఖాళీ స్థలాలు, తరగతి గదులు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు.కేంద్రం నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, వారికి ఉపాధి కల్పించడంతో పాటు సొంతంగా వ్యాపారాలు, వృత్తులు ప్రారంభించేలా ప్రోత్సహించడమే ఆర్ఎస్ఈటీఐ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు.శిక్షణ పొందేందుకు వచ్చే వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించేలా శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, మహిళా శిశు వికాస కేంద్ర మేనేజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక గుస్సాడి దండారి వేడుకలు



- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

(సిరికొండ/ ఆదిలాబాద్, సాక్షర): ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు గుస్సాడి దండారి ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గిరిజనుల ప్రత్యేక సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గురువారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో నిర్వహించిన గుస్సాడి దండారి ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరంద్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాల్లో సందడి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల విశిష్టమైన సంప్రదాయంలో భాగమైన గుస్సాడి దండారి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావడం సంతోషాన్నిస్తోందని పేర్కొన్నారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటిని భావితరాలకు అందిస్తున్న గిరిజనులను అభినందించారు.ఐటీడీఏ పీవో మంద మకరంద్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు వారి సాంస్కృతిక వేడుకలకు ఐటీడీఏ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గుస్సాడి దండారి నృత్య సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించడం అందరి బాధ్యతని తెలిపారు. గిరిజన సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గుస్సాడి దండారి వేడుకలు ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఒక గ్రామానికి చెందిన దండారి బృందాలు మరో గ్రామానికి వెళ్లి వేడుకల్లో పాల్గొనడం గిరిజనుల మధ్య ఉన్న ఐక్యతకు నిదర్శనమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలను పాటిస్తూ పండుగలను సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. రిమ్మ గ్రామం ఇప్పటికే అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని, గ్రామస్థులంతా ఐక్యంగా గుస్సాడి దండారి ఉత్సవాల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రుత్విక్, ఎంపీడీవో సంతోష్, గ్రామ పటేల్ శంకర్, విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు మహేందర్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళా నాయకురాలు



- అమీనా ఖాన్‌ను పరామర్శించిన సీపీఐ నాయకులు

(ఆదిలాబాద్,సాక్షర): భారత కమ్యూనిస్ట్ పార్టీ, భారత జాతీయ మహిళా సమాఖ్య ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనా ఖాన్‌ను సీపీఐ నాయకులు పరామర్శించారు.గత వారం రోజుల క్రితం యాత్రకు వెళ్లినప్పుడు నెల్లూరులో కాలు జారి పడటంతో రిమ్స్‌లో చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అమీనా ఖాన్‌ను నాయకులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనేక ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొన్న అమీనా ఖాన్ త్వరగా కోలుకొని మళ్లీ ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. అమీనా ఖాన్, ఆమె భర్త మహబూబ్ ఖాన్ ఇద్దరూ ప్రజా పోరాటాలను కొనసాగిస్తున్నారని నాయకులు అన్నారు.పరామర్శించిన వారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు ప్రభాకర్ రెడ్డి, జిల్లా సీపీఐ సీనియర్ నాయకులు షేక్ పాషా, కుంటాల రాములు, సలీం ఖాన్, బీకేఎంయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అద్దంకి రమేష్, ఖండాల గణేష్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు కడప సురేష్, మహబూబ్ ఖాన్ ఉన్నారు.

శాంతినగర్‌లో నూతనంగా నందన్ పాల కేంద్రం ప్రారంభం



- మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) : నిర్మల్ పట్టణంలోని శాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నందన్ పాల కేంద్రాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పాల కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నూతన పాల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నందన్ పాల కేంద్రం ప్రజల ఆదరణ పొందుతూ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్.పి. రాజు, చెనిగరపు నరేష్, పెండం శ్రీనివాస్, కొండాజీ రాఘవేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో ఘనంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ



(చెన్నూర్, సాక్షర): చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వార్డులోని ప్రతి ఇంటికీ ఐదు చొప్పున మొక్కలను పంపిణీ చేశారు. పంపిణీ చేసిన వాటిలో పూల మొక్కలతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు కూడా ఉన్నాయి.ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ అజీముద్దీన్ మహమ్మద్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ మొక్కలు నాటి, వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని పిలుపునిచ్చారు. మన చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మదనపోచమ్మ ఆలయ డైరెక్టర్ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పాతర్ల నాగరాజు, సద్ది సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చేతిలో.. బాల్యం బందీగా!

స్మార్ట్‌ఫోన్ మోజులో చదువు, ఆటలు, కుటుంబ బంధాలు కనుమరుగు.. పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఇప్పటికైనా మేల్కొనాలి! ఒకప్పుడు సాయంత్రం అయిందంటే చాలు.. వీధులు పిల్లల ఆటలతో కళకళలాడేవి. మైదానాల్లో పరుగులు, చెట్ల కింద స్నేహాలు, ఆటల్లో గెలుపోటములు.. ఇవే బాల్యానికి అందమైన జ్ఞాపకాలు. కానీ నేడు ఆ దృశ్యాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఆటస్థలాల్లో కనిపించాల్సిన పిల్లలు స్మార్ట్‌ఫోన్ల తెరలకు అతుక్కుపోతున్నారు. చేతిలో సెల్‌ఫోన్.. కళ్లలో తెర వెలుగు.. కానీ వారి బాల్యంలో మునుపటి ఉత్సాహం కనిపించడం లేదు.ఇది సాంకేతిక అభివృద్ధా? లేక మనమే మన పిల్లల బాల్యాన్ని డిజిటల్ తెరలకు బలిచేస్తున్నామా?

చదువు పేరుతో ఫోన్.. చివరకు వ్యసనానికి బాట!

పిల్లలకు ఆన్‌లైన్ చదువుల కోసం, సమాచార సేకరణ కోసం తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్లు అందిస్తున్నారు. కానీ ఆ అవసరం కాస్తా రీల్స్, షార్ట్ వీడియోలు, ఆన్‌లైన్ గేమ్స్, యాట్యూబ్ వినోదానికి అలవాటుగా మారుతోంది. ఐదు నిమిషాలు చూస్తానని ఫోన్ తీసుకున్న పిల్లలు గంటల తరబడి దానిని వదలలేని పరిస్థితి ఏర్పడుతోంది.

పుస్తకం తెరవడానికి బద్ధకం.. పాఠాలు చదవడానికి ఆసక్తి లేకపోవడం.. ఏకాగ్రత తగ్గడం.. చదువుపై నిర్లక్ష్యం పెరగడం వంటి సమస్యలు తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చదువుకోవాల్సిన వయసులో తెరల ప్రపంచంలో మునిగిపోతే రేపటి లక్ష్యాలు ఎలా చేరుకుంటారు?

ఆరోగ్యానికి ముప్పు.. మానసిక ప్రశాంతతకు దెబ్బ!

అవసరానికి మించి స్క్రీన్ చూడటం వల్ల కళ్ల అలసట, నిద్రకు ఆటంకం, శారీరక చురుకుదనం తగ్గడం వంటి సమస్యలు ఎదురుకావచ్చు. అంతేకాదు, నిరంతరం వేగంగా మారే వీడియోలు, గేమ్స్‌కు అలవాటు పడితే పిల్లల్లో విసుగు, చిరాకు, అసహనం, ఏకాగ్రత సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది.

ఆడుకోవాల్సిన వయసులో కూర్చోవడం.. పరుగెత్తాల్సిన వయసులో తెర ముందు గడపడం.. ప్రకృతితో మమేకం కావాల్సిన సమయంలో డిజిటల్ ప్రపంచంలో బందీలుగా మారడం ఆందోళనకరం.

ఒకే ఇంట్లో.. నాలుగు మనసులు.. నాలుగు ఫోన్లు!

కుటుంబ వ్యవస్థలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఒకే ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు ఉన్నా ఎవరి చేతిలో వారి ఫోన్ ఉంటుంది. పిల్లలతో మాట్లాడటానికి తల్లిదండ్రులకు సమయం ఉండదు. తల్లిదండ్రులతో మనసు విప్పి మాట్లాడటానికి పిల్లలకు ఆసక్తి ఉండదు.

పిల్లలకు ఖరీదైన ఫోన్లు కొనిస్తున్నాం.. కానీ వారితో గడపడానికి విలువైన సమయాన్ని ఇవ్వగలుగుతున్నామా? బొమ్మలు, గాడ్జెట్లు అందిస్తున్నాం.. కానీ ఆప్యాయత, అనుబంధం, మంచి అలవాట్లు నేర్పిస్తున్నామా?

పిల్లలకు కావాల్సింది మరో కొత్త ఫోన్ కాదు.. వారితో మాట్లాడే అమ్మానాన్నలు!

సోషల్ మీడియా మరో ప్రమాదకర ప్రపంచం!

ఇంటర్నెట్‌లో మంచి సమాచారం ఎంత ఉందో.. పిల్లల వయసుకు తగని కంటెంట్, హానికరమైన గేమ్స్, సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు కూడా అంతే ఉన్నాయి. ఎవరు పరిచయమవుతున్నారో, ఏం చూస్తున్నారో, ఎలాంటి ప్రభావానికి గురవుతున్నారో తల్లిదండ్రులకు తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

పిల్లల చేతికి ఫోన్ ఇచ్చి బాధ్యత తీరిపోయిందనుకోవడం పొరపాటు. డిజిటల్ ప్రపంచంలో వారిని సురక్షితంగా నడిపించే బాధ్యత కూడా పెద్దలదే.

తల్లిదండ్రులారా.. ఇప్పటికైనా మేల్కొనండి!

సెల్‌ఫోన్‌ను పూర్తిగా నిషేధించడం పరిష్కారం కాదు. దాని వినియోగంపై నియంత్రణ, అవగాహన, పర్యవేక్షణ అవసరం.

పిల్లల వయసుకు తగిన స్క్రీన్ టైమ్‌ను నిర్ణయించాలి.

చదువు అవసరాలకు మాత్రమే ఫోన్ వినియోగించేలా అలవాటు చేయాలి.

భోజన సమయంలో, పడుకునే ముందు ఫోన్లకు దూరంగా ఉంచాలి.

పిల్లలతో రోజూ కొంత సమయం ఆటలు, సంభాషణలకు కేటాయించాలి.

పుస్తక పఠనం, క్రీడలు, సంగీతం, సృజనాత్మక కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

పిల్లలు ఏం చూస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే విషయాలపై స్నేహపూర్వకంగా అవగాహన కల్పించాలి.

ఆది వరాహ స్వామి ఆలయ డైరెక్టర్ మృతి.

కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన శ్రీ ఆది వరాహ స్వామి ఆలయ పాలకవర్గ డైరెక్టర్ బొజ్జ సతీష్ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు గోదావరిఖనిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన పార్థీ దేహానికి ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఫ్యాక్స్ చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, జూలపల్లి సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్, ఆదివార స్వామి ఆలయ డైరెక్టర్లు తీగల రాజయ్య గౌడ్, పిల్లి రాజు, సాగి శ్రీనివాసరావు, బూస శ్రీనివాస్ గౌడ్, అనవేన శ్యామల సదయ్య,తోపాటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెబల్ రాజ్ కుమార్, రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తులసి రామ్ గౌడ్, రత్నాపూర్ మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, రత్నాపూర్ మాజీ ఉపసర్పంచ్ కాటన్ సత్యం, భూస తిరుపతి, వార్డు సభ్యుడు చొప్పరి సంతోష్, తదితరులు పార్థివదేహానికి నివాళులర్పించారు. పలువురు డైరెక్టర్లు పాడిన మోయడం జరిగింది. సతీష్ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

పార్లమెంటుకు రండి చర్చిద్దాం..

మీడియా, దేశ యువత సమక్షంలో ఈ చర్చ జరగాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడాన్ని అమిత్ షా తప్పుబట్టారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎస్ఐఆర్ జరగలేదని, అయినా కాంగ్రెస్ ఓటమి పాలైందని వ్యాఖ్యానించారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఎస్ఐఆర్ లేదని, అయినప్పటికీ కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదని అన్నారు. పార్లమెంటు సమావేశాలను సజావుగా సాగనివ్వకుండా.. బయట సభలు, ఆందోళనలతో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. వీధుల్లో జనాన్ని సమీకరించి ఆందోళనలు కొనసాగిస్తే బీజేపీ కార్యకర్తలు తగిన సమాధానం చెబుతారని షా హెచ్చరించారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీని, కాంగ్రెస్‌ను పదేపదే తిరస్కరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిర్వహించిన సభకు దేశవ్యాప్తంగా 10 లక్షల మందిని పిలిచామని కాంగ్రెస్ చెప్పిందని, అయితే సభా ప్రాంగణం సామర్థ్యం 70 వేల మందేనని, అందులోనూ సగం ఖాళీగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వివరాలను కూడా ప్రజలకు వెల్లడించాలని అమిత్ షా డిమాండ్ చేశారు. ఆ వివరాలు తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందని వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

ట్రంప్ ఓటమి..

దీంతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పడిపోయాయి.ఇంకా ఎన్నికలకు ముందే ట్రంప్ దీనిపై కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. ఇరాన్ ఒక ఒప్పందాన్ని కోరుకుంటోందని, తాము కూడా అందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాజాగా ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో సైనిక చర్యల కంటే ముందుగా దౌత్య మార్గాల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని చూస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యుద్ధాన్ని ముగించేందుకు ఖతార్ కూడా మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఇటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, సౌదీ, యూఏఈ, కువైట్, ఇరాక్ దేశాల ముడి చమురు ఎగుమతులన్నీ కలిపి అక్టోబరులో 10 శాతం పెరిగి రోజుకు 15.53 మిలియన్ బ్యారెళ్లకు చేరడం కూడా ధరల తగ్గుదలకు కారణమైంది. ఇదే మరిన్ని రోజులు కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

ఆదర్శ గ్రామ పంచాయతీగా "ఇల్లూరు" ఎంపిక..

ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ గ్రామంలోని కులమత రాజకీయాలకు అతీతంగా ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేపట్టి ఆదర్శ గ్రామంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు సహకరించిన జిల్లా, మండల అధికారులకు సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published, Edited and Owned by A. Linganna, Printed at EVR Printers, Vidyanagar, Adilabad - 504001. Telangana.
Published at D.No. 5-91/2, Talamadugu (Vill & Mandal) Adilabad - 504312. A.P. RNI No. APTEL/2011/42149. Editor A. Linganna.
Phone: 08732-231345. Email: Saaksharaadb@gmail.com